



బిల్లులు రాక దిగాలు..!



కూటమి నాయకులే కాంట్రాక్టర్లుగా మారి..

శరవేగంగా పల్లె పండుగ పనులు

నేటికీ అందని బిల్లులు

అప్పులకు వడ్డీలు కట్టలేక తిప్పలు

కొత్త పనులు చేయించడం అధికారులకు సవాలే..



అనంతపురం న్యూటౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి పనుల ఊసేలేకుండా పోయింది. కూటమి కొలువుదీరగానే పల్లె పండుగ పేరుతో పెద్దఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో సభలు పెట్టి ప్రజాప్రతినిధులు.. అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తామని ప్రకటించారు. ఆ మేరకు పార్టీ శ్రేణుల్లో సైతం ఉత్సాహం నింపారు. అదే ఊపులో ఉపాధి హామీ పథకం నిధులు రూ.105 కోట్లతో జిల్లాలో రోడ్ల పనులను గుర్తించారు. బిల్లులు వెంటనే వస్తాయన్న ఉద్దేశంతో కూటమి పార్టీల నాయకులే కాంట్రాక్టర్ల అవతారమెత్తారు. పోటీపడి మరీ.. పనులు దక్కించుకున్నారు. అప్పులు చేసి, పనులు చాలావరకు పూర్తి

మిగతా 6లో...

భద్రత బంగారం?

- బ్యాంకుల్లో సొమ్ముకు భద్రత కరువు
- సెక్యూరిటీ గార్డుల్లేని కొన్ని శాఖలు
- సులువుగా కన్నం వేస్తున్న దొంగలు
- తూమకుంట ఎస్‌బీఐలో భారీ చోరీ



తూమకుంట చెక్‌పోస్టులో ముళ్లపొదల మధ్య ఉన్న ఎస్‌బీఐ

హిందూపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఖర్చు తగ్గించుకోవాలని పలు బ్యాంకులు వ్యవహరిస్తున్న తీరు ఖాతాదారుల సొమ్ముకు భద్రత కరువయ్యేలా చేస్తోంది. బ్యాంకులు సెక్యూరిటీ గార్డులను నియమించు కోకపోవడంతో కోట్లాదిరూపాయలు విలువచేసే ఖాతాదారుల బంగారం, డబ్బుకు ప్రమాదం ఏర్పడుతోంది. సీసీ కెమెరాలపై ఆధారపడి ఎటువంటి సెక్యూరిటీ గార్డులను బ్యాంకుల వద్ద ఏర్పాటు చేయకపోవడంతో నేరస్తులు సులువుగా బ్యాంకులకు కన్నాలేయడానికి ప్రయత్నిస్తున్నారు. హిందూపురం మండలంలోని తూమకుంట చెక్‌పోస్టులో ఎస్‌బీఐలో జరిగిన భారీ దోపిడీనే ఇందుకు నిదర్శనం.

సెక్యూరిటీ లేకపోవడమే..

ఇటీవల ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో జరిగిన బ్యాంకు దోపిడీ లను గమనిస్తే సెక్యూరిటీ లేకపోవడమే ప్రధాన కారణంగా అగుపిస్తోంది. ఇటీవల చాలా మంది ఖాతాదారులు ఇంట్లో బంగారం ఉంచుకోవడానికి భయపడి బ్యాంకుల్లో భద్రంగా ఉంటుందని లాకర్లలో భద్రపరుస్తున్నారు. ఇందుకు బ్యాంకులు కొంత మొత్తంలో సొమ్ము వసూలు చేస్తున్నాయి. అయితే ఖాతాదారుల సొమ్ముకు మాత్రం భద్రత కల్పించలేకపోతున్నాయి. పై వారి ఆదేశాలంటూ నిరంతరం కాపలా ఉండాల్సిన (మిగతా 6వ పేజీలో...)

ఎస్‌బీఐలో చొరబడ్డ దొంగలు

రూ.37.92 లక్షలు, 10 కిలోల బంగారం చోరీ

హిందూపురం మండలం తూమకుంట పారిశ్రామికవాడలోని ఎస్‌బీఐ బ్రాంచిలో దొంగలు పడ్డారు. బ్యాంకు వెనుకవైపు కిటికీకి ఉన్న ఇనుప చువ్వలను కోసేసి లోపలికి ప్రవేశించారు. గ్యాస్ కట్టర్‌తో లాకర్‌ను తెరిచి, రూ.37.92 లక్షలు, పది కేజీ బంగారం ఆభరణాలను చోరీ చేశారు. బ్యాంకులో 592 మంది బంగారం కుదువపెట్టారు. వీరిలో ఎందరి బంగారం పోయిందో, ఎందరిది సురక్షితంగా ఉందో తేల్చేందుకు లెక్కింపు కొనసాగిస్తున్నారు.

(వివరాలు మెయిన్‌లో)



పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉంచిన ద్విచక్రవాహనాలు

కొనుగోలు ఇలా..

కింగ్‌మేకర్‌లాంటి వ్యక్తి హైదరాబాద్‌తోపాటు ముఖ్య నగరాలను కేంద్రంగా చేసుకొని ద్విచక్ర వాహనాల వ్యాపారాన్ని సాగిస్తున్నట్లు సమాచారం. ఆయన మొదట నగరంలోని మురికివాడల్లో నివసించే వారి ఆధార్‌కార్డులను తీసుకుని, వాటికి ఇతర ఫేక్ డాక్యుమెంట్లు సృష్టిస్తాడు. తర్వాత ద్విచక్రవాహనాల కొనుగోలు కోసం డౌన్‌పేమెంట్ కింద రూ.20వేల నుంచి రూ.30వేల వరకు చెల్లిస్తారు. మిగిలిన మొత్తానికి ఫైనాన్స్‌లో రుణం ఇప్పిస్తారు. తర్వాత ఆధార్‌కార్డు ఇచ్చిన వ్యక్తికి రూ.10వేల వరకు ఇచ్చి, వాహనం తీసుకుని వేరేవారిని విక్రయిస్తారు. కొత్త ద్విచక్రవాహనం షోరూంలో కంటే తక్కువ ధరకు వస్తుండటంతో పలువురు రికార్డులు లేకపోయినా ఫరవలేదని కొనుగోలు చేశారు. మొదట హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఈ వ్యాపారాన్ని క్రమేణా పెనుకొండ, అనంతపురం, తాడిపత్రి, గుత్తికి చెందిన పలువురు విస్తరించినట్లు సమాచారం. మూడు నెలల కిందటే పట్టణంలోని ప్రధాన కూడళ్లల్లో నెంబరు లేని ద్విచక్రవాహనాలను పోలీసులు సీజ్ చేసినట్లు సమాచారం.

వార్నీ బండి బడా..!

- ఫైనాన్స్‌లో ద్విచక్రవాహనాల కొనుగోలు
- వాయిదాలు చెల్లించకనే విక్రయం
- రికార్డుల్లేకుండానే తక్కువ ధరకు అమ్మకం
- తాడిపత్రిలో నెలకిందట 90 బైకుల సీజ్
- హైదరాబాద్ కేంద్రంగా దందా.. జిల్లాకు విస్తరణ
- మాయలోడు ఎవరా అని స్థానిక ప్రజల్లో చర్చ

తాడిపత్రి, జూలై 28(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలను హైదరాబాద్ కేంద్రంగా ఫైనాన్స్‌లో కొనుగోలు చేసి, వాయిదాలు చెల్లించకుండా, కొద్ది రోజులకే వాటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్న వ్యక్తి ఎవరా అని తాడిపత్రి పట్టణ ప్రజలు ఆరా తీస్తున్నారు. మట్కా, పేకాట కేంద్రాలు నిర్వహిస్తూ సొమ్ము చేసుకునే వారు ప్రస్తుతం ట్రెండ్ మార్చి ద్విచక్ర వాహనాలను రికార్డులు లేకుండా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దాదాపు నెలరోజుల కిందట తనిఖీల్లో నెంబరు ప్లేట్ లేని రెండు వాహనాలను పోలీసులు గుర్తించారు. తక్కువ ధరకే అమ్ముతుండటంతో రికార్డులు లేకపోయినా కొన్నట్లు ఆ వాహనాన్ని నడుపుతున్న వారు పోలీసులకు వివరించారు. దీంతో పోలీసులు లోతుగా విచారణ జరిపారు. రెండు మూడు రోజుల్లోనే రికార్డులు లేని దాదాపు 90 కొత్త ద్విచక్ర వాహనాలను గుర్తించి, ఆరుగురిని అరెస్ట్ చేశారు. ఇందులో తాడిపత్రి సబ్ డివిజన్‌లోనే 71వాహనాలను గుర్తించారు. అనంతపురం, పామిడి, గుత్తి, యాడికి, పెద్దపప్పూరు, యల్లనూరు, కడపజిల్లాలోని కొండాపురం, నంద్యాల జిల్లాలోని బనగానపల్లి, కొలిమిగుండ్ల ప్రాంతాల్లో రికార్డులు లేని ఇలాంటి వాహనాలు పలువురు కొనుగోలు చేసినట్లు సమాచారం.

పురోగతి శూన్యం

రికార్డులు లేని ద్విచక్రవాహనాలను సీజ్ చేసి దాదాపు నెలలు గడుస్తున్నా కేసులో పురోగతి ఏమీ లేదు. హైదరాబాద్ కేంద్రంగా వ్యాపారం సాగిస్తున్నారని విలేకరుల సమావేశంలో చెప్పినా, ఆ దిశగా విచారణ చేసి, చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమయ్యారు. నెలరోజుల నుంచి పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే దాదాపు కోటిరూపాయల విలువగల నూతన ద్విచక్రవాహనాలు ఉంచారు. ఇవి వివిధ కేసుల నిమిత్తం స్టేషన్‌కు వచ్చే ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా మారాయి. ఇంకా రికార్డుల్లేని వందలాది వాహనాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీటిలో ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు, టాటాఏస్ వాహనాలు, ద్విచక్రవాహనాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. కాగా సీజ్ చేసిన ద్విచక్రవాహనాలను ఏమిచేయాలో దిక్కుతోచని స్థితిలో పోలీసు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. రికార్డులు లేకపోవడంతో వాహనాల యజమానులు కూడా పోలీస్‌స్టేషన్‌కు రావడానికి జంకుతున్నట్లు తెలిసింది. అయితే ఫైనాన్స్ ఇచ్చిన సంస్థలు కూడా దీనిపై ఎలాంటి ఫిర్యాదు ఇంత వరకు చేయలేదని పోలీసులు తెలిపారు.



నిందితులను చూపుతున్న పోలీసు అధికారులు (ఫైల్)

లోతుగా దర్యాప్తు చేస్తున్నాం

అక్రమ వాహనాల కేసుకు సంబంధించి లోతుగా దర్యాప్తు చేస్తున్నాం. త్వరలోనే హైదరాబాద్‌కు వెళ్లి విచారించి ప్రధాన సూత్రధారులను పట్టుకుంటాం. సీజ్‌చేసిన వాహనాల గురించి ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

\- సాయిప్రసాద్, పట్టణ సీఐ



తిన్నింటి వాసాలు..!

- హెచ్‌డీఎఫ్‌సీలో బంగారాన్ని కాజేసిన ఉద్యోగి
- కీర్తన ఫైనాన్స్‌లో తాకట్టు.. అక్కడి ఉద్యోగి సహకారం
- అందులో కొంత నకిలీ.. కొంత అసలు బంగారం
- రూ.2 కోట్ల దాకా ఘరానా మోసం
- నలుగురి అరెస్టు.. పరారీలో మరొకరు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం క్రైం, జూలై 28(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో పనిచేసే ఓ ఉద్యోగి, గతంలో పనిచేసిన మరో ఉద్యోగి, ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేసే ఇంకో ఉద్యోగి.. ఒక్కటయ్యారు. బయటి వ్యక్తులతో కలిసి ఉపాధి కల్పించిన సంస్థలకు ద్రోహం చేశారు. ఫలితంగా హెచ్‌డీఎఫ్‌సీలో తాకట్టు బంగారం మాయమైంది. హెచ్‌డీఎఫ్‌సీ రాంనగర్ బ్రాంచిలో గోల్డ్ లోన్ ఆఫీసర్‌గా పనిచేసే వెంకటంపల్లి సతీష్ కుమార్ ఈ స్కాంలో కీలకంగా వ్యవహరించాడు. గోల్డ్ లోన్ రెన్యువల్ కోసం వచ్చినవారిని బురిడీ కొట్టించి.. లోన్ అకౌంట్ క్లోజర్ పత్రాలపై సంతకాలు చేయించుకున్నాడు. ఆ బంగారాన్ని నగరంలోని కీర్తన ఫైనాన్స్‌లో ఇతరుల పేరిట తాకట్టు పెట్టాడు. అందులోనూ కొంత అసలు, మరికొంత నకిలీ బంగారం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడు, రాణినగర్‌కు చెందిన వెంకటంపల్లి సతీష్‌కుమార్(28), జాకీర్ కొట్టాలకు చెందిన జయరాములు(30), గణేష్ నగర్‌కు చెందిన సాయికృష్ణ(28), నందమూరి నగర్‌కు చెందిన బోయ శ్రీనివాసులు అలియాస్ శీను(28)ను అరెస్టు చేశారు. ఈ మోసానికి సహకారం అందించిన కీర్తన ఫైనాన్స్ మేనేజర్ నరేష్ పరారీలో ఉన్నాడు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జగదీష్, ఎస్ఐ భాస్కర్ నాయుడు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి, ఈ కేసు వివరాలను వెల్లడించారు. నరేష్ దొరికితే ఈ కేసులో మరింత స్పష్టత వస్తుందని డీఎస్పీ అన్నారు. అసలు, నకిలీ బంగారం కలిపి 2,180 గ్రాములు తనఖా పెట్టారని తెలిపారు. దీంతో రూ.2 కోట్ల దాకా మోసం జరిగినట్లు స్పష్టమౌతోంది. (వివరాలు మెయిన్‌లో)



రికార్డు ప్రవాహం

- హంద్రీనీవాలో 2వేలకుపైగా క్యూసెక్కులు
- కాలువ చరిత్రలో అత్యధికంగా నీరు సరఫరా

(7లో..)

ప్లస్-2 పల్టీ..!

- వైసీపీ హయాంలో హైస్కూళ్లలో ఇంటర్
- నిర్వహణ, వసతుల కల్పన గాలికి..
- చేరేందుకు బాలికలు ససేమిరా
- అడ్మిషన్లు లేక మూసివేత



కూడేరు ప్లస్-2 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

అనంతపురం విద్య, జూలై 28(ఆంధ్రజ్యోతి): బాలికా విద్య కోసం అంటూ ప్లస్-2 విధానాన్ని తీసుకొచ్చిన గత వైసీపీ ప్రభుత్వం నిర్వహణను మాత్రం గాలికొదిలేసింది. హైస్కూళ్లలోనే బాలికల కోసం ప్రత్యేకంగా ఇంటర్మీడియట్ అమలు చేసింది. వసతులు, బోధన సిబ్బంది నియామకాన్ని పట్టించుకోలేదు. దీంతో పాఠాలు చెప్పేవారు లేక ప్లస్-2 ఉన్నత పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థినులు ససేమిరా అంటున్నారు. ప్రవేశాలు లేక వాటిని ఎత్తివేస్తున్నారు.

బాలికలు పదో తరగతి పూర్తికాగానే ఇతర ప్రాంతాలకు వెళ్లలేక చదువు మానేస్తుంటారు. వారిని ఇతర ప్రాంతాలకు పంపించలేక చదువు మాన్పించి, తల్లిదండ్రులు వివాహాలు చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కరించే దిశగా ఉన్నత పాఠశాలలోనే బాలికల కోసం ఇంటర్మీడియట్ ప్రవేశ పెట్టారు. ప్లస్-2 ఉన్నత పాఠశాలలుగా నామకరణం చేశారు. అది రెండేళ్లు కూడా నడవలేకపోయింది. పిల్లలు చేరకపోవడంతో ఆ ప్లస్-2 స్కూళ్లలో ఇంటర్‌ను ఎత్తివేశారు. ఇకనుంచి సాధారణ ఉన్నత పాఠశాలలుగా కొనసాగనున్నాయి.

బ్రహ్మసముద్రంలో ఒక్కరే..

జిల్లాలో ఐదు ఉన్నత పాఠశాలను ప్లస్-2 స్కూళ్లుగా నామకరణం చేశారు. బుక్కరాయసముద్రం (శింగనమల), కూడేరు (ఉరవకొండ), డీ హిరేహాళ్ (రాయదుర్గం), పెద్దవడుగూరు (తాడిపత్రి), బ్రహ్మసముద్రం (కళ్యాణదుర్గం) జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలను ప్లస్-2గా మార్చారు. బ్రహ్మసముద్రం ప్లస్-2 ఉన్నత పాఠశాలలో మాత్రం 18మంది విద్యార్థినులు చేరారు. మిగిలిన నాలుగు స్కూళ్లలో ఒక్క విద్యార్థిని కూడా చేరకపోవడం గమనార్హం.

అనాలోచితమా.. బాధ్యతారాహిత్యమా?

ప్లస్-2 స్కూళ్ల వైఫల్యానికి సర్కారు అనాలోచిత నిర్ణయమా.. అధికారులు, ప్రధానోపాధ్యాయుల బాధ్యతారాహిత్యం కారణమా అనేది ప్రధాన ప్రశ్నగా మారింది. వైసీపీ హయాంలో 117 జీఓలో ప్లస్-2 స్కూళ్లను తీసుకొచ్చారు. పేదపిల్లలకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావడం మంచిదే. ఆ విద్యను ప్రవేశ పెట్టేటపుడు అమలు చేస్తున్న ప్లస్-2 స్కూళ్లలో ఇంటర్‌కు అవసరమైన వసతులు ఉన్నాయా... ఫ్యాకల్టీ నియామకాన్ని పట్టించుకోలేదు. అవేమీ ఆలోచించకుండానే ఇంటర్ విద్యను ప్రవేశపెట్టారు. ఈ కారణంతోనే అట్టర్ ఫ్లాప్ అయిందనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్లస్-2 స్కూళ్ల బలోపేతం విషయాన్ని అధికారులు, ప్రధానోపాధ్యాయులు, టీచర్లు ఏమాత్రం పట్టించుకోలేదని స్పష్టంగా తెలుస్తోంది. మండలస్థాయి ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో వందమంది వరకు ఉంటారు. వీరిలో 70 నుంచి 80 మంది పాస్ అవుతుంటారు. ప్లస్-2 ఉన్నత పాఠశాలలో బోధన బాగుంటే సగం మంది ఇక్కడే చేరే అవకాశం ఉంటుంది. బాలికలు చేరట్లేదంటే బోధన, వసతులు లేకపోవడమే కారణమన్నది సుస్పష్టం.

ఎత్తివేత..

విద్యార్థులు లేకపోవడంతో ప్లస్-2 స్కూళ్లలో ఇంటర్మీడియట్ ఎత్తివేశారు. ఇటీవల ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. ఎక్కడైనా విద్యార్థినులు చేరి ఉండుంటే వారికి జూనియర్ కళాశాలలో అడ్మిషన్ కల్పించనున్నారు. దీంతో ప్లస్-2స్కూళ్లు ఇక నుంచి సాధారణ ఉన్నత పాఠశాలలుగానే కొనసాగనున్నాయి.

ఎస్సీ, ఎస్టీ భూముల బదలాయింపు

చట్టాన్ని అమలు చేయాలి

● ఇన్‌చార్జి కలెక్టర్‌కు నాయకుల వినతి



ఇన్‌చార్జి కలెక్టర్‌తో దళిత సంఘాల నాయకులు

అనంతపురం కలెక్టరేట్, జూలై 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ భూముల బదలాయింపు చట్టాన్ని అమలు చేయాలని పలు దళిత, గిరిజన సంఘాలు డిమాండ్ చేశాయి. ఆ సంఘాల నాయకులు నేరిమెట్ల ఎల్లన్న, చిన్న పెద్దన్న, నగేష్, రమణ, రామాంజినేయులు తదితరులు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతపురం రూరల్ మండలం కురుగుంటలో ఎరికల ఆదినారాయణమ్మకు చెందిన సర్వే నంబరు 136-3వ లెటర్‌లో కొంత భూమిని ఇతరులు రిజిస్టర్ చేయించుకున్నారని, పోలీసులు కేసు కట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై 30సార్లు అధికారులకు విన్నవించుకున్నామని, ఎవరూ పట్టించుకోలేదని అన్నారు. ఏ శాఖ నుంచైనా ఎండార్స్‌మెంట్లు వస్తాయని, కానీ తహసీల్దార్లు మాత్రం ఎండార్స్‌మెంట్లు ఇవ్వడం లేదని వాపోయారు. తక్షణమే అధికారులతో మాట్లాడి తమకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో ఇన్‌చార్జ్ కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి, త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఉపాధి హామీ పథకంలో అవినీతి

● సాకే శైలజానాథ్



తమ నియోజకవర్గంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని వైసీపీ శింగనమల నియోజవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ ఇన్‌చార్జి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, అధికార పార్టీ నాయకులు ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. పనులు కల్పించినందుకు ఒక్కో కూలీ నుంచి వారానికి రూ.200, రూ.300 వసూలు చేస్తున్నారని అన్నారు. బీకేఎస్ మండలంలో వాటాల చెల్లింపు విషయంలో నాయకులు రోడ్డుపైనే కొట్టుకున్నారని, నార్పల మండలంలో అక్రమాలకు పాల్పడి, సస్పెండ్ అయినవారు కూడా విధులలో కొనసాగుతున్నారని అన్నారు. పుట్లూరు మండలంలో చనిపోయిన వ్యక్తుల పేరిట బిల్లులు పెట్టి సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

టీసీ ఇవ్వడం లేదు..

నగర శివారులోని పాములాయి వద్దనున్న ఓ ప్రైవేటు పాఠశాలలో టీసీ ఇవ్వకుండా వేధిస్తున్నారని ఏకలవ్య ఫెడరేషన్ అధ్యక్షుడు వెంకటరామయ్య ఇన్‌చార్జి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భరత్ అనే ఏడో తరగతి విద్యార్థికి రూ.20వేలు ఫీజు చెల్లిస్తేనే టీసీ ఇస్తామని అంటున్నారని, పేద కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.



చెరువుకట్టపై పూజలు నిర్వహిస్తున్న భక్తులు



అనంతపురంలో నాగులపుట్ట వద్ద...

నాగరాజా కరుణించు..!

అనంతపురం టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాస చవితిని పురస్కరించుకుని సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో నాగదేవతలకు విశేష పూజలు నిర్వహించారు. సుభాష్‌రోడ్డులోని నాగుల పుట్ట, మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, చెరువుకట్ట తదితర ప్రాంతాల్లోని నాగుల కట్టలు, పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నాగుల ప్రతిమలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, ఒకరికొకరు చేతులకు కంకణాలు కట్టుకుని, నాగదేవతలను స్తుతిస్తూ పుట్టలో పాలుపోశారు. చిన్న, పెద్ద తేడా లేకుండా అన్ని వయసుల వారు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.





స్వాతంత్ర్య దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

● ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 79వ స్వాతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, ఆర్డీఓ మలోలతో కలిసి ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 15న పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహిస్తామన్నారు. లోటుపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రౌండ్‌లో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, జెండా వందనం, కవాతు ఏర్పాట్లను పోలీస్ శాఖ, కార్యక్రమం నిర్వహణ పూర్తి ఏర్పాట్ల పర్యవేక్షణ, ప్రోటోకాల్‌ను అనంతపురం ఆర్డీఓ చూడాలని, అనంతపురం తహసీల్దారు సీటింగ్ ఏర్పాట్లను చేపట్టాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమ నిర్వహణను డీఈఓ చూడాలని, అత్యవసర వైద్య సేవలను డీఎంహెచ్ఓ, పారిశుధ్యం, తాగునీటి ఏర్పాటును నగర కమిషనర్ చూడాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలపై స్టాల్స్, వ్యవసాయం, ఉద్యానశాఖ ఏపీఎంఐపీ, పశుసంవర్ధకశాఖ, మత్స్యశాఖ, చేనేత, జౌళిశాఖ, పథక సంచాలకులు, డీఆర్డీఏ- వెలుగు, మెప్మా, మహిళా శిశు సంక్షేమ శాఖ, సంక్షేమ శాఖలకు చెందిన ఒక పెద్ద స్టాల్ ఏర్పాటు చేయాన్నారు. ఇన్‌చార్జ్‌గా హెచ్‌ఎన్ఎస్ఎస్ ఎస్‌డీసీ వ్యవహరిస్తారన్నారు. ఎవరికి కేటాయించిన పనులను వారు సక్రమంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

కయ్యం తెచ్చిన 'కసువు'

- ఫిర్యాదు చేస్తే మాపైనే కేసు పెట్టారు
- ఎస్పీ వద్దకు కళ్యాణదుర్గం రూరల్ స్టేషన్ బాధితులు
- పోలీస్ పీజీఆర్ఎస్‌లో 87 అర్జీలు

అనంతపురం క్రైం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఊడ్చే కసువు (చెత్త)కయ్యం తెచ్చి పెట్టింది. ఇది పోలీస్‌స్టేషన్, తర్వాత ఎస్పీ వరకూ వెళ్లేలా చేసింది. తమపై దాడి చేశారని ఫిర్యాదు చేస్తే.... దాడి చేసిన వాళ్లు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తమపైనే కేసు పెట్టారని బాధిత దంపతులు ఎస్పీ జగదీష్ వద్ద మొరపెట్టుకున్నారు. ఈ ఘటన కళ్యాణదుర్గం రూరల్ పోలీస్టేషన్‌లో జరిగింది. బీకేఎస్ మండలం సంజీవపురంలో గేదెలు ఎత్తుకెళ్లారని, న్యాయం చేయాలని బాధితులు విన్నవించుకున్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జగదీష్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, బాధితులు హాజరైన విన్నవించుకున్నారు. మొత్తం 87 అర్జీలు వచ్చినట్లు డీపీఓ వర్గాలు తెలిపాయి.

ఫిర్యాదు చేసిన మాపైనే కేసు...

కసువు తెచ్చిన కయ్యం విషయంగా ఎం.కొండాపురం గ్రామానికి చెందిన సుధారాణి, ఆమె భర్త శ్రీనివాసాచారి ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. సుధారాణి మాట్లాడుతూ 'ఈ నెల 13న ఇంటి ముందుర ఖాళీ స్థలంలో కసువు ఊడుస్తుండగా పక్కింటి శాంతమ్మ ఇక్కడెలా ఊడుస్తావంటూ గొడవకు దిగింది. ఎదురింట్లో ఉన్న సురేష్, స్వామి లాల్ క్రిష్ణ, సులోచన వచ్చి, బూతులు తిడుతూ దాడి చేశారు. నా కుమార్తె బిందుమతిని కూడా కాళ్లతో తన్నారు. వీళ్ల దాడిపై అదే రోజు కళ్యాణదుర్గం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. అయితే శాంతమ్మ 19న ఫిర్యాదు చేస్తే, వాళ్ల ఫిర్యాదు మేరకు నాతోపాటు నా భర్త, కుమార్తైపై పోలీసులు కేసు పెట్టారు. మాకు కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు అన్యాయం చేశారు. మీరే న్యాయం చేయాలి' అని ఎస్పీకి విన్నవించారుజ

సిగ్నల్ ఆధారంగా... గేదెలు కనిపెట్టండి

తమ గ్రామంలో గేదెలు చోరీ అవుతున్నాయని, న్యాయం జరిగేలా చూడాలని బాధితులు బుక్కరాయసముద్రం మండలం సంజీవపురానికి చెందిన ఓబిరెడ్డి, రామలింగారెడ్డి ఎస్పీకి విన్నవించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 21న ఓబిరెడ్డికి చెందిన గేదె, భాస్కర్‌రెడ్డికి చెందిన గేదె, రామలింగారెడ్డి సోదరి పెద్దక్క గేదె మార్చి 25న చోరీ అయ్యాయన్నారు. తమ పంచాయతీలో సెల్ టవర్ ఉందని, చెన్నంపల్లి పంచాయతీలోని సెల్ టవర్ సిగ్నల్స్ తగులుతాయని, వాటి ఆధారంగా కాల్ డేటా సేకరించి గేదెలు చోరీ చేసిన నిందితులను అరెస్టు చేయాలని కోరారు.

ఉత్తమ పీఎంశ్రీ స్కూల్‌గా గుత్తి ఏపీఆర్ఎస్

అనంతపురం విద్య, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఉత్తమ పీఎం శ్రీ స్కూల్ (ప్రైమ్‌మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా)గా గుత్తి ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల ఎంపికైంది. దేశంలో ప్రతి రాష్ట్రం నుంచి విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దిన స్కూళ్లను బెస్ట్ పీఎం శ్రీ పాఠశాలలుగా కేంద్రమానవ వనరుల శాఖ ఎంపిక చేసింది. అందులో మన రాష్ట్రం తరఫున జిల్లాకు చెందిన గుత్తి ఏపీఆర్ఎస్ స్కూల్ ఎంపికైనట్లు ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ సోమవారం తెలిపారు. దీనిపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

సాగు చేసే పంటలకు మాత్రమే

బీమా ప్రీమియం

● జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 28(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసే పంటలకు మాత్రమే ప్రీమియంను జమ చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్‌బీమా పథకం, వాతావరణ పంటల బీమా పథకం విధి, విధానాలు, ప్రయోజనాలు, పంటల వారిగా రైతు ఎకరాకు చెల్లించాల్సిన వివరాలను వివరించారు. అనంతరం ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు తెలిసేలా గ్రామాల్లో ప్రచారం చేసి, పంటల బీమా నమోదు చేసుకునేలా చూడాలని సూచించారు. ఇంతవరకు వాతావరణ బీమా పథకంలో 1,47,122హెక్టార్లకు 1,59,100 మంది రైతులు, దిగుబడి ఆధారిత బీమాలో 8,662.12 హెక్టార్లకు గాను 10,194 మంది రైతులు పంట నమోదు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

నేడు స్వమిత్వపై శిక్షణ

అనంతపురం న్యూటౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని స్వమిత్వ పథకంలో ఎంపికైన 280 గ్రామాలకు సంబంధించిన సిబ్బందికి మంగళవారం మండల స్థాయిలో శిక్షణ ఏర్పాటు చేసినట్లు డీపీఓ నాగరాజనాయుడు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మండల సర్వేయర్లు వారికి సంబంధించిన శిక్షణా కేంద్రాల్లో శిక్షణకు హాజరయ్యేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ శిక్షణ ప్రణాళిక ప్రకారం జరిగేలా సంబంధిత డిప్యూటీ ఎంపీడీఓలు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

శిక్షణాకేంద్రాలు ఇలా...

అనంతపురం రూరల్, కూడేరు మండలాకు సంబంధించి అనంతపురం ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఏర్పాటు చేశారు. బుక్కరాయసముద్రం, నార్పల మండలాలకు బుక్కరాయసముద్రం ఎంపీడీఓ కార్యాలయం, రాప్తాడు, ఆత్మకూరు మండలాలకు రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయం, గార్లదిన్నె, శింగనమలకు గార్లదిన్నె ఎంపీడీఓ కార్యాలయం, తాడిపత్రి, పెద్దపప్పూరు మండలాలకు తాడిపత్రి ఎంపీడీఓ కార్యాలయం, యాడికి, పెద్దవడుగూరుకు యాడికి ఎంపీడీఓ కార్యాలయం, గుత్తి, పామిడికి గుత్తి ఎంపీడీఓ కార్యాలయం, గుంతకల్లు, వజ్రకరూరుకు గుంతకల్లు ఎంపీడీఓ కార్యాలయం, ఉరవకొండ, బెళుగుప్ప, విడపనకల్లుకు ఉరవ కొండ ఎంపీడీఓ కార్యాలయం, రాయదుర్గం, గుమ్మఘట్టకు రాయదుర్గం ఎంపీడీఓ కార్యాలయం, బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్‌కు బొమ్మనహాళ్ ఎంపీడీఓ కార్యాలయం, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రంకు కళ్యాణదుర్గం ఎంపీడీఓ కార్యాలయం, కుందుర్పి, కంబదూరు, శెట్టూరుకు కుందిర్పి ఎంపీడీఓ కార్యాలయం, పుట్లూరు, యల్లనూరుకు పుట్లూరు ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఇచ్చేలా ఏర్పాటు చేశారు.

భద్రత బంగారం?

(5వ పేజీ తరువాయి)

సెక్యూరిటీగార్డ్‌లను తొలగిస్తున్నారు. దీంతో దొంగలు సీసీ కెమెరాలను ధ్వంసం చేసి తమ పనిని సులువగా చేసుకువెళ్తున్నారు.



బ్యాంకులో పరిశీలిస్తున్న డీఎస్పీ మహేష్



బ్యాంకులో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

ఆందోళనలో ఖాతాదారులు

ఇదిలా ఉంటే పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకుని చోరీల భయంతో ప్రజలు ఇళ్లలో బంగారం ఉంచుకోవడం లేదు. తమ సొమ్ముకు భద్రత ఉంటుందనే భావనలో బ్యాంకులో తనఖా పెట్టి కొంత రుణం తీసు కుంటున్నారు. మరి కొందరు లాకర్లలో పెడుతున్నారు. కానీ తూమకుంట ఎస్‌బీఐలో జరిగిన సంఘటనలతో హిందూపురం ప్రాంతంలోని బ్యాంకుల ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ఏదైనా లాకర్లలో సొమ్ముపోతే అదిపెట్టిన వ్యక్తులపైనే ఉంటుంది కానీ బ్యాంకులపై ప్రభావం ఉండదు. దీంతో ఖాతాదారులకు ధైర్యం చెప్పడానికి బ్యాంకర్లు తీవ్రంగా యత్నిస్తున్నట్లు తెలిసింది.

నివాసాలకు దూరంగా..

ఉమ్మడి జిల్లాలో అనంతపురం తరువాత హిందూపురంలోనే బ్యాంకు శాఖలు ఎక్కువగా ఉన్నాయి. సుమారు 25కిపైగా బ్యాంకులు ఉండగా ఫైనాన్స్ సంస్థలు 20కిపైగా ఉన్నాయి. ఇందులో చాలా వరకు నివాసాలకు దూరంగా ఉన్నాయి. ముఖ్యంగా హిందూపురం మండలం లోని తూమకుంట చెక్‌పోస్టులో ఉన్న ఎస్‌బీఐ, వడ్డిపల్లిలో ఉన్న మరో బ్యాంక్ భవనం చుట్టూ కంపచెట్లు ఏపుగా పెరిగాయి. పగటిపూట సైతం ఎవరైనా వెళ్తే గుర్తించలేని విధంగా పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో తూమకుంట వద్ద ఉన్న ఎస్‌బీఐ శాఖలో కిటికీ ఊచలను గ్యాస్ కట్టర్‌తో తొలగించి దొంగలు లోపలికి చొరబడ్డారు. లాకర్లలో ఉన్న రూ.37.92 లక్షల నగదు, భారీగా బంగారం ఆభరణాలను ఎత్తుకెళ్లారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో దొంగలు సులువుగా పని ముగించారు. ఈక్రమంలోనే బ్యాంకులు, బంగారం కుదువ పెట్టుకునే ఫైనాన్స్ కంపెనీలు రూ.కోట్ల విలువైన ఖాతాదారుల బంగారానికి సరైన భద్రత కల్పించల్సి ఉంది.



సెక్యూరిటీ గార్డ్‌ను పెట్టుకోవాలి: డీఎస్పీ

హిందూపురం సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న బ్యాంక్‌లవద్ద రాత్రింపగళ్లు సెక్యూరిటీగార్డ్‌ను తప్పనిసరిగా పెట్టుకోవాలి. సెక్యూరిటీగార్డ్ ఉంటే చోరీ జరగడానికి ఆస్కారం ఉండదు. కోట్లాది రూపాయలు విలువచేసే బంగారం నగలు, నగదు పెట్టుకుని సెక్యూరిటీగార్డ్ పెట్టకపోవడం విడ్డూరంగా ఉంది. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సెక్యూరిటీగార్డ్ ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకుంటాం.

బిల్లులు రాక దిగాలు!

(5వ పేజీ తరువాయి)

చేశారు. బిల్లులు మాత్రం అందలేదు. చాలామందికి రూపాయి కూడా రాలేదు. దీంతో పనుల కోసం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక తిప్పలు పడుతున్నారు. ప్రజాప్రతినిధుల వద్ద మొరపెట్టుకున్నా.. వారు పట్టించుకోవట్లేదని బాధితులు వాపోతున్నారు. 'పనులు చేయండి.. బిల్లులు వచ్చేలా చూస్తాం' అంటూ హామీ ఇచ్చిన అధికారులు.. మొహం చాటేస్తున్నారు. దీంతో పనులు చేసిన కూటమి నాయకులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఈ పరిస్థితుల్లో మళ్లీ అభివృద్ధి పనులు చేయించడం అధికారులకు సవాల్‌గా మారింది. కొత్త పనులు చేయించలేమని చేతులెత్తేస్తున్నారు.

పెద్దఎత్తున పనులు

కూటమి కొలువుదీరాక గతేడాది అక్టోబరులో పల్లె పండుగ కింద జిల్లావ్యాప్తంగా 1,961 రోడ్డు పనులను గుర్తించారు. 217.18 కిలోమీటర్ల పొడవైన రోడ్ల పనులు రూ.105 కోట్లతో చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. కూటమి నాయకులే కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి 1,838 పనులు పూర్తిచేశారు. 109 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. 14 పనులు ప్రారంభమే కాలేదు. పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా.. బిల్లులు మాత్రం మంజూరు కాలేదు. దీంతో మిగిలిన పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపట్లేదు. మందకొడిగా సాగుతున్నాయన్న వాదనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో నియోజవర్గానికి రూ.3 కోట్లతో పనులు మంజూరు చేశారు. అధికారులు అంచనాలు తయారు చేసి, ప్రభుత్వానికి పంపారు. పల్లె పండుగ బిల్లులే రాని పరిస్థితుల్లో కాంట్రాక్టర్లతో కొత్త పనులు చేయించడం వారికి తలనొప్పిగా మారింది. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి పూర్తిచేసిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులకు రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో శ్రీకారం చుట్టింది. దీంతో అధికారులు ఉత్సాహంగా బిల్లులు అప్‌లోడ్ చేశారు. ఆ ప్రక్రియ పూర్తయి నెల గడిచినా చిల్లిగవ్వ కూడా బిల్లులు విడుదల కాలేదు. దీంతో అధికారులను నైరాశ్యం ఆవరించింది. ఈ పరిస్థితుల్లో పల్లె పండుగలో అనుమతి పొందిన 14 పనులు మొదలెట్టడానికి కూడా కాంట్రాక్టర్లు వెనకడుగు వేస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం చేసిన పనులకు సంబంధించి బిల్లులు మంజూరైతే తప్ప.. కొత్తగా చేసే పరిస్థితులు కనిపించడం లేదన్న చర్చ సాగుతోంది.

డీలాపడ్డ నాయకులు

పల్లె పండుగ పనులు చేసిన కూటమి నాయకులు బిల్లులు రాక డీలా పడ్డారు. తమ సమస్య ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక కుమిలిపోతున్నారు. పనుల కోసం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారన్న ప్రచారం సాగుతోంది. నియోజకవర్గ నాయకుల వద్దకెళ్లి గోడు చెప్పుకుందామంటే.. వారు కూడా పట్టించుకోవట్లేదని తెలుస్తోంది. దీంతో పనులు చేసిన మండల, గ్రామస్థాయి నాయకులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

బిల్లులన్నీ అప్‌లోడ్ చేశాం

పల్లె పండుగ పేరుతో చేపట్టిన పనులన్నీ దాదాపు పూర్తయ్యాయి. వాటికి సంబంధించి బిల్లులను అప్‌లోడ్ చేశాం. బిల్లులు పడుతున్నాయి. ఆగస్టు 15లోపు మొత్తం బిల్లులు పడతాయని భావిస్తున్నాం.

-ప్రభాకర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ, పంచాయతీ రాజ్ శాఖ



వెనక్కు పంపించెన్..!

● మంజూరైనా లబ్ధిదారులకు అందని సొమ్ము ● డబ్బు వెనక్కు పంపిన కార్యదర్శి ● భర్త పింఛన్ కోసం వితంతువుల ఎదురుచూపు

● మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో రామచంద్ర అనే వ్యక్తి మృతి చెంది ఏడాది అయ్యింది. ఆయన భార్యకు రాష్ట్ర ప్రభుత్వం వితంతు పింఛన్ మంజూరు చేసింది. గత నెలలో పింఛన్ సొమ్ము అందించాల్సి ఉన్నా ఇవ్వలేదు.

● శ్రీధరఘట్ట గ్రామంలో ఉప్పర గోవింద ఏడాది కిందట మృతి చెందాడు. ఆయన భార్య ఈరమ్మకు ఇటీవల వితంతు పింఛన్ మంజూ రైంది. గత నెల డబ్బులు వచ్చినప్పటికీ ఆమెకు ఇవ్వలేదు. కారణం తెలియదు. పింఛన్ సొమ్మును తిరిగి ప్రభుత్వానికి కార్యదర్శి జమచేశారు. ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే.

బొమ్మనహాళ్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలో పింఛన్ కోసం అనేకమంది వితంతువులు ఎదురు చూస్తున్నారు. ఇదివరకు భర్తకు వస్తున్న పింఛన్ తమకు ఇప్పించమని దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్నారు. వైసీపీ పాలనలో మూడేళ్ల మాత్రమే కొత్త పింఛన్లు మంజూరు చేశారు. తర్వాత పట్టించుకోలేదు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఎన్నికల హామీ మేరకు వృద్ధులు, వితంతువుల పింఛన్ మొత్తాన్ని ఒకేసారి రూ. 1000 పెంచి రూ.4వేలు చేశారు. 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్య కాలంలో మృతి చెందిన పింఛన్ లబ్ధిదారులకు సంబంధించి, వారి జీవిత భాగస్వా ములకు కొత్త పింఛన్ మంజూరు చేస్తామని ప్రభుత్వం తెలిపింది. ఈ ఏడాది మే నెలాఖరుకు అర్హుల జాబితాను ప్రకటించి, జూన్ నుంచి పంపిణీ చేస్తామని చెప్పింది కానీ జూలై గడిచిపోతున్నా కొత్త పింఛన్లు మంజూరు కాకపోవడంతో వితంతువులు ఆందోళన చెందుతున్నారు.

81 పింఛన్ల మంజూరు

మండలంలో కొత్తగా 81 పింఛన్లు మంజూరయ్యాయి. వీటికి సంబంధించి సుమారు రూ.3.24లక్షలు వచ్చాయి. గతనెల 12న పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించారు. ఏమైందో తెలియదు గానీ పంపిణీ చేయకుండా తిరిగి ఆ డబ్బును ప్రభుత్వానికి జమచేశారు. జూలైలో కూడా డబ్బులను వెనక్కు పంపారు. దీంతో పింఛన్ వస్తుందని ఎదురు చూసిన వితంతువులకు నిరాశే మిగిలింది. టీడీపీ నాయకులు తొలిఅడుగు కార్యక్రమంలో బిజీగా ఉన్నారు. దీంతో కొత్త పింఛన్ల పంపిణీలో జాప్యం జరుగుతున్నట్లు సమాచారం. ఆగస్టు నెలలోనైనా పింఛన్ డబ్బులు వస్తాయా అని పలువురు వితంతువులు ఎదురు చూస్తున్నారు.

ఆదేశాలు రావాలి

కొత్త పింఛన్లు ఇవ్వడానికి రెండు, మూడు రోజుల్లో ఆదేశాలు వస్తాయని అంటున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. అందుకే రెండు నెలల సొమ్ము వచ్చినా, లబ్ధిదారులకు ఇవ్వకుండా, తిరిగి ప్రభుత్వానికి జమ చేశాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే పంపిణీ చేస్తాం.


-విజయభాస్కర్, ఎంపీడీఓ, బొమ్మనహాళ్

పింఛన్ ఇచ్చి ఆదుకోవాలి: లక్ష్మీదేవి, ఉద్దేహాళ్



నా భర్త రామచంద్ర చనిపోయి ఏడాది అవుతుంది. నాభర్తకు వచ్చే పింఛన్ డబ్బులతో జీవించేవాళ్లం. మాకు పిల్లలు లేరు. నా భర్త చనిపోయినప్పటి నుంచి జీవనం కష్టంగా ఉంది. ప్రభుత్వం మంజూరు చేసిన వితంతువు పింఛన్ డబ్బులు ఇచ్చి ఆదుకోవాలి. ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నా. మాత్రలు కొనాలన్న డబ్బులు లేక సమస్యగా ఉంది.

కూలి పనులకు వెళ్తున్నా: ఈరమ్మ, శ్రీధరఘట్ట



నా భర్త చనిపోయినా ఆయనకు వచ్చే పింఛన్ నాకు వస్తుందంటే కాస్తంత ఊరట చెందా. నా జీవనానికి పింఛన్ డబ్బులు తోడవుతాయని అనుకున్నా. దరఖాస్తు చేయగానే ప్రభుత్వం పింఛన్ కూడా మంజూరు చేసింది. అయితే డబ్బులు ఇవ్వలేదు. దీంతో వ్యవసాయ పనులకు కూలి పనులకు వెళ్లి బతుకుతున్నా. నాకు పిల్లలు లేరు. ప్రభుత్వం పింఛన్ డబ్బులు ఇచ్చి ఆదుకోవాలి.

అత్యాధునిక విద్యాలయం..!



యూనివర్సిటీ ముఖద్వారం


సుందరంగా తీర్చిదిద్దిన రోడ్లు

అనంతకు వరం సెంట్రల్ యూనివర్సిటీ

2018లో ఆరు కోర్సులు..

వందమంది విద్యార్థులతో ప్రారంభం

నేడు 26 కోర్సులు, వేలాదిమంది విద్యార్థులు

అత్యాధునిక భవనాలు, వసతులు

ఆహ్లాదకర వాతావరణంలో విద్యాబోధన

నేడు వర్సిటీని ప్రారంభించనున్న కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్

అనంతపురం వైద్యం, జూలై 28(ఆంధ్రజ్యోతి): అధునాతన విద్యకు వేదిక అయిన కేంద్రీయ విశ్వవిద్యాలయం దినదినాభివృద్ధి చెందుతోంది. చిన్నగా ప్రారంభమై, వందల ఎకరాలకు విస్తరించింది. అనంతకు తలమానికంగా మారింది. వేలాది మంది విద్యార్థులకు అధునాతన కోర్సులను బోధిస్తోంది. ఉపాధి కల్పనలో మేటిగా నిలుస్తోంది. బుక్కరాయసముద్రం మండలం జంతలూరు వద్ద వేలమంది విద్యార్థులు, అత్యాధునిక వసతులు, భవనాలు.. ఇలా.. అన్నీ అద్భుతమే. అభివృద్ధి చెందిన దేశాల్లోని వర్సిటీలను తలదన్నేలా ఉంది.

ఆరు కోర్సులతో ప్రారంభం

రాష్ట్ర విభజనలో భాగంగా ఏపీకి రావాల్సిన సెంట్రల్ యూనివర్సిటీని అప్పటి టీడీపీ ప్రభుత్వం జిల్లాలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా సీయూఏపీ 2018లో సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం 1860కింద అనంతపురంలో స్థాపించిన సెంట్రల్ యూనివర్సిటీ 2019లో పార్లమెంట్ చట్టం ద్వారా అధికారికంగా గుర్తింపు పొందింది. తాత్కాలికంగా 2018 ఆగస్టు 5న జేఎన్టీయూలో ఆరు కోర్సులతో విద్యాబోధన ప్రారంభించారు. అనంతరం శాశ్వత వర్సిటీ నిర్మాణానికి బుక్కరాయసముద్రం మండలం జంతలూరు వద్ద 491.03 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వ కేటాయించింది. అందుకు అవసరమైన ప్రహరీ, విద్యుత్, నీరు, రెండు లైన్ల రహదారి రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చింది. 2019లో ప్రభుత్వం మారడంతో వర్సిటీ అభివృద్ధి మందకొడిగా సాగింది. అవసరమైన అనుమతులు, నిధుల విషయంలోనూ నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటుకావడంతో సెంట్రల్ వర్సిటీ అభివృద్ధి వేగం పుంజుకుని పనులు పూర్తిచేసేలా పర్యవేక్షించింది. దీంతో మంగళవారం నూతన సెంట్రల్ యూవర్సిటీగా ప్రారంభం కానుంది. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వర్చువల్‌గా వర్సిటీని ప్రారంభించనున్నారు.

1600 మందికిపైగా విద్యార్థులు

2018 ఆగస్టు 5న నాలుగు డిగ్రీ, రెండు పీజీ కోర్సులతో సెంట్రల్ యూనివర్సిటీ ప్రారంభించారు. ప్రస్తుతం 47 కోర్సులతో 23 రాష్ట్రాలకు చెందిన 1600 మందికిపైగా విద్యార్థులు క్యాంపస్‌లో అభ్యసిస్తున్నారు. 9 డిగ్రీ, 17 పీజీ, 6 పీహెచ్‌డీ, 15 డిప్లొమా కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తున్నారు. గత ఐదేళ్లలో వందలాది మంది విద్యార్థులు కోర్సులు పూర్తిచేసుకుని పట్టాలు పొందారు. వివిధ రంగాల్లో వారు ఉద్యోగాలు చేస్తున్నారని ప్లేస్‌మెంట్ అధికారులు తెలిపారు. క్యాంపస్‌లో పరిపాలనా భవనంతోపాటు మొత్తం 34 నూతన భవనాలను అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించారు.

నూతన క్యాంపస్

బుక్కరాయసముద్రం మండలం జంతలూరు వద్ద 491.03 ఎకరాల్లో వర్సిటీ నూతన క్యాంపస్‌ను ఏర్పాటు చేశారు. భవన నిర్మాణాలు, వసతుల కల్పనకు రూ.711 కోట్లను కేటాయించారు. మొదటి దశ కింద రూ.350 కోట్లు వెచ్చించి నిర్మాణాలు చేపట్టారు. ఇందులో ముఖ్యంగా 2200 మంది విద్యార్థులు వసతి పొందేలా ఆరు అంతస్తుల హాస్టల్ భవనాలు నిర్మించడం విశేషం. ఆహ్లాదకరమైన వాతావరణంలో, అత్యాధునిక భవనాలు, నూతన వసతుల మధ్య విద్యార్థులకు బోధిస్తున్నారు.

పరిశోధనలకు పునాది



పరిశోధన రంగంలో విద్యార్థులు ప్రవేశించేందుకు సెంట్రల్ యూనివర్సిటీ ఒక పునాది. బీఎస్సీ ప్రైవేటు కళాశాలలో పూర్తిచేశా. సైంటిస్ట్ కావాలన్న ఆకాంక్షతో ఉన్నత చదువులకు వెళ్లాలంటే ప్రైవేటు విద్యాసంస్థల్లో అధికంగా ఖర్చుచేయాల్సి ఉంటుంది. సెంట్రల్ యూనివర్సిటీ నోటిఫికేషన్‌తో ప్రవేశం పొంది పీజీ పూర్తి చేస్తున్నా.

- అంజుమ్, పీజీ ద్వితీయ సంవత్సరం, మాలిక్యులర్ బయాలజీ

ప్రత్యేక కోర్సులు



వర్సిటీలో ప్రత్యేక కోర్సులు అందిస్తున్నారు. సెంట్రల్ యూనివర్సిటీలో అలాంటి కోర్సులను విద్యార్థులకు అందిస్తున్నారు. దీంతో దక్షిణ భారత దేశంలోని విద్యార్థులు ఇక్కడకే వస్తున్నారు. ఉత్తర భారత దేశానికి చెందిన విద్యార్థులు కూడా చాలామంది చదువుతున్నారు. భవిష్యత్తుకు అనుగుణంగా డిగ్రీ, పీజీ కోర్సులు అందిస్తున్నారు.

-మారెన్, డిగ్రీ తృతీయ సంవత్సరం, ఎకనామిక్స్

అవకాశాల నిధి..



విద్యార్థులకు సెంట్రల్ యూనివర్సిటీ అవకాశాలు కల్పించే నిధి లాంటిది. ఫార్మా, ఫుడ్ సేఫ్టీ, ఇంజనీరింగ్, అగ్రికల్చర్ తదితర రంగాల్లో అవకాశాలు కల్పించేలా కోర్సులను ప్రవేశ పెట్టారు. ఇక్కడ విద్యను పూర్తి చేసుకుని డిగ్రీ పట్టా అందుకున్న విద్యార్థులు ఉన్నత భవిష్యత్తును అధిరోహిస్తారు.

-అశ్విని, పీజీ ద్వితీయ సంవత్సరం, మాలిక్యులర్ బయాలజీ


అకడమిక్ బ్లాక్


తరగతుల నిర్వహణపై విద్యార్థులను ఆరాతీస్తున్న వీసీ ఎస్ఏ కోరి

చరిత్రలో నిలిచిపోయేలా..

వంద సంవత్సరాలపాటు విద్యనందించే వర్సిటీగా నిలిచిపోయేలా సెంట్రల్ యూనివర్సిటీని ప్రభుత్వం ఏర్పాటుచేసింది. వేలాది మంది విద్యార్థులు డిగ్రీ, పీజీ కోర్సులు అభ్యసిస్తున్నారు. చరిత్రలో నిలిచిపోయేలా విశ్వవిద్యాలయం ఏర్పాటైంది.

- ప్రొఫెసర్ ఎస్ఏ కోరి, సెంట్రల్ యూనివర్సిటీ వీసీ

సివిల్స్‌కు పట్టు



సివిల్స్‌లో ర్యాంకులు కొట్టేందుకు ఢిల్లీ వరకు ప్రత్యేక కోచింగ్ తీసుకునేందుకు విద్యార్థులు పరుగులు పెడుతున్నారు. సెంట్రల్ యూనివర్సిటీలో డిగ్రీ నుంచే సివిల్స్ పరీక్షపై పట్టు సాధించే స్థాయిలో బోధిస్తున్నారు. అనంతపురంలో ఇలాంటి వర్సిటీని ఏర్పాటుచేయడం వరమే.

-మెగావత్ లావణ్య, డిగ్రీ ద్వితీయ సంవత్సరం, పొలిటికల్ సైన్స్

విద్యార్థులకు ప్రాధాన్యం



వర్సిటీలో చదివిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రాధాన్యత ఇస్తున్నారు. మాలిక్యులర్ బయాలజీలో ఇదే వర్సిటీలో పీజీ పూర్తిచేశా. ఉద్యోగ ప్రకటనతో దరఖాస్తు చేసుకుని ఇంటర్వ్యూకి వచ్చా. ఇక్కడి విద్యార్థులకు ప్రాధాన్యత ఇచ్చేలా అదనపు పాయింట్లతో అవకాశాలు కల్పిచండంతో ల్యాబ్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించా.

- అజ్మతుల్లా, ల్యాబ్ అసిస్టెంట్, మాలిక్యులర్ బయాలజీ

వడ్డీ వ్యాపారులను కఠినంగా శిక్షించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్


కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న రాంభూపాల్, నాయకులు

ధర్మవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో చేనేత కార్మికుడు రమణ, ఆయన కుటుంబ సభ్యులపై దాడి చేసిన వడ్డీ వ్యాపారులను కఠినంగా శిక్షించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం నాయకులతో కలిసి సోమవారం సాయంత్రం ఆయన చేనేత కార్మికుడు రమణ ఇంటికి వెళ్లి పరామర్శించారు. జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రమణ తాను తీసుకున్న అప్పు రూ.2లక్షలు, స్నేహితుడికి పూచి పడి ఇప్పించిన అప్పు రూ.4లక్షలు మొత్తం రూ.ఆరు లక్షలకు వారానికి రూ.60వేలు వడ్డీ చెల్లించినట్లు సీపీఎం నాయకులకు వెల్లడించారు. ఇప్పటి వరకు మొత్తం రూ.15.3లక్షలు చెల్లించానని, దానికి సంబంధించిన అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నట్లు వారికి వివరించారు. అనంతరం రాంభూపాల్ మాట్లాడుతూ రూ.15లక్షలు వసూలు చేసుకుని కూడా చేనేత కార్మికుడు, ఆయన కుటుంబ సభ్యులపై దాడి చేయడం దారుణమన్నారు. పోలీసులు సమగ్ర విచారణ జరిపి వడ్డీవ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం, మంత్రి సత్యకుమార్ తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఎంనాయకులు జంగాలపల్లి పెద్దన్న, జేవీరమణ, మారుతి, ఆదినారాయణ, అయూబ్‌ఖాన్, హరి, ఎస్ఎఫ్ఐ నాయకుడు నాగార్జున ఉన్నారు.

రుయాలో గుండె పోటుతో వైద్యుడి మృతి


డాక్టర్ నరేంద్ర (ఫైల్)

తిరుపతి(వైద్యం), జూలై 28(ఆంధ్రజ్యోతి): వార్డులో రోగులను పరీక్షించిన వైద్యుడు.. బయటకు వస్తూనే కుప్పకూలారు. గుండె పోటుకు గురై మృతిచెందారు. ఈ విషాద ఘటన తిరుపతిలోని రుయాస్పత్రిలో సోమవారం చోటుచేసుకుంది. జనరల్ మెడిసిన్ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ నరేంద్ర(55) సోమవారం మధ్యాహ్నం వరకు వార్డులో పలువురు రోగులను పరీక్షించారు. మరో వార్డులో రోగులను పరీక్షించేందుకు వెళుతున్న సమయంలో గుండెపోటు రావడంతో ఆస్పత్రి ఆవరణలోనే కుప్పకూలారు. వెంటనే వైద్య విద్యార్థులు, వైద్య సిబ్బంది ఆయన్ను పక్కనే ఉన్న అత్యవసర విభాగానికి తీసుకెళ్లారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం స్విమ్స్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందారు. ఈయన స్వగ్రామం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం. ఇటీవలనే నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి బదిలీపై రుయాస్పత్రికి వచ్చారు. ఆయన మృతికి ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ రాధతోపాటు పలువురు వైద్య విభాగాధిపతులు సంతాపం తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో దంపతుల ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న దంపతులు

బొమ్మనహాళ్, జూలై28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో ఆర్యవైశ్య కాంప్లెక్స్‌లో ఒక జంట అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. స్థానికులు, బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్ తెలిపిన మేరకు కర్ణాటకలోని హొస్పేట్‌కు చెందిన హఫ్రీనా(20), రెహమాన్(25) దంపతులు నెల రోజులు కిందట ఆంజనేయస్వామి దేవాలయం, కాంప్లెక్స్‌లకు రంగు వేసేందుకు వచ్చారు. ఆర్యవైశ్య కాంప్లెక్స్‌లో ఒక గదిని అద్దెకు తీసుకుని పెయింట్ పనులు చేస్తున్నారు. దేవాలయం పెయింట్ పనులు ముగిసిన తర్వాత గ్రామంలో మరికొందరి పెయింట్ పనులు చేస్తున్నారు. ఏమి జరిగింతో కాని సోమవారం ఉదయం నుంచి బయటకు రాలేదు స్థానికులు కొందరు గది కిటికీలో నుంచి చూడగా దంపతులు ఉరికి వేలాడుతూ కనిపించారు. దీంతో బొమ్మనహాళ్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టమోటాలు కిలో రూ.40

అనంతపురం రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో సోమవారం కిలో టమోటాలు రూ.40తో అమ్ముడుపోయాయి. అలాగే సరాసరిగా రూ.34, కనిష్టంగా రూ.20 పలికాయి. మార్కెట్‌కు మొత్తంగా 3,300టన్నుల టమోటాలు వచ్చినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు.

ఎస్కేయూను ఉన్నత స్థానంలో నిలుపుదాం

వైస్ చాన్స్‌లర్ ఆచార్య అనిత

ఘనంగా వర్సిటీ ఫౌండేషన్ డే


జ్యోతి వెలిగిస్తున్న వీసీ

అనంతపురం రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): సమష్టిగా పనిచేసి యూనివర్సిటీని ఉన్నత స్థానంలో నిలుపుదామని ఎస్కేయూ వీసీ ఆచార్య అనిత పిలుపునిచ్చారు. వర్సిటీలోని భువన విజయ ఆడిటోరియంలో సోమవారం యూనివర్సిటీ ఫౌండేషన్ డేను ఘనంగా నిర్వహించారు. వర్సిటీ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వీసీ ఆచార్య అనిత, విశిష్ట అతిథిగా యూనివర్సిటీ మాజీ రెక్టార్ విశ్వేశ్వరరావు, యూనివర్సిటీ రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు హాజరయ్యారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎంతో మంది కృషి వలన యూనివర్సిటీ ఉన్నత స్థానంలో ఉందన్నారు. రూసా నిధులతో పది సెమినార్ హాళ్ళ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. పీఎం ఉష కింద రూ.20కోట్ల అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. వాతావరణ శాస్త్ర అధ్యయనాలు, భౌతిక శాస్త్ర విభాగంలో ఇస్రో వారి సహకారంతో పరిశోధనలు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. విశిష్ట అతిథి విశ్వేశ్వర రావు మాట్లాడుతూ వీసీ అనిత యూనివర్సిటీ అభివృద్ధికి ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. విద్యార్థులు వర్సిటీలోని వసతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఫౌండేషన్ డేను పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బోధన, బోధనేతరసిబ్బంది, విశ్రాంత అధ్యాపకులు, వర్సిటీలోని వివిధ కళాశాల ప్రిన్సిపాళ్లు, పరిశోధక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రికార్డు ప్రవాహం

హంద్రీనీవాలో 2వేలకుపైగా క్యూసెక్కులు

కాలువ చరిత్రలో అత్యధికంగా నీరు సరఫరా

రాగులపాడు వద్ద 8 పంపుల ద్వారా ఎత్తిపోతలు

అన్నదాతల హర్షం


రాగులపాడు లిఫ్ట్ వద్ద ఎనిమిది పంపుల నుంచి దూకుతున్న నీరు

ఉరవకొండ/బెళుగుప్ప, జూలై 28(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ చరిత్రలోనే అత్యధికంగా నీరు పారిస్తున్నారు. వజ్రకరూరు మండలం రాగులపాడు వద్దనున్న లిఫ్ట్ వద్ద సోమవారం ఏకంగా ఎనిమిది పంపుల ద్వారా నీటిని ఎత్తి పోస్తున్నారు. కాలువ చరిత్రలో ఇప్పటివరకు 6 పంపులతోనే తోడేవారు. ఏకంగా 8 పంపులతో ఎత్తిపోయడం ఇదే ప్రథమం. గతంలో అత్యధికంగా 1,700 క్యూసెక్కులు మాత్రమే కాలువలో పారింది. ప్రస్తుతం 2 వేలకుపైగా క్యూసెక్కులు పారిస్తున్నారు. మొత్తం 12 పంపులతో 3,600 క్యూసెక్కుల నీటిని కాలువలో ప్రవహింప జేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ప్రస్తుతం జీడిపల్లి జలాశయానికి 1,382 క్యూసెక్కుల నీరు చేరుతోంది. జీడిపల్లి రిజర్వాయర్ పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 1.68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.398 టీఎంసీల నీరు ఉంది. మరో మూడు రోజుల్లో జలాశయం నిండనుంది. ఆ తరువాత నీటిని పీఏబీఆర్‌కు వదిలేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలోని చాయాపురం, రాగులపాడు, జరుట్ల రాంపురం, చిన్నముష్టూరు తూములకు 100 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. 34వ ప్యాకేజీలో డీ1, డీ2 డిస్ట్రిబ్యూటరీలకు 60 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈ శ్రీనివాస్ నాయక్ తెలిపారు.

పీఏబీఆర్‌ను నింపండి: మంత్రి కేశవ్

జీడిపల్లి రిజర్వాయర్ నిండిన వెంటనే పీఏబీఆర్‌కు వదలాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్.. ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. హంద్రీనీవా కాలువకు ఎనిమిది పంపులతో నీటిని విడుదల చేస్తున్నామన్నారు. పీఏబీఆర్ నిండేలోపు ఫేజ్-2 పనులను పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు.

ఆ శివయ్య వేరయా..!

- పెద్దాస్పత్రిలో ప్రైవేటు 'శివయ్య' వసూళ్లు
- అదే పేరున్న ఉద్యోగికి తంటాలు


సాకే శివయ్య

అనంతపురం వైద్యం, జూలై 28(ఆంధ్రజ్యోతి): సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులను మభ్యపెడుతూ ఒక వ్యక్తి వసూళ్ల పర్వం సాగించాడు. సదరం సర్టిఫికెట్ల మంజూరు, వెరిఫికేషన్, ఆరోగ్యశ్రీ, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ తదితర రూపాల్లో డబ్బు వసూలు చేయసాగాడు. ఆసుపత్రిలోని సిబ్బంది పేర్లుచెప్పి పనులు చేయిస్తానని బాధితులకు నమ్మబలికాడు. వారి నుంచి నగదుతోపాటు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బు వేయించుకున్నాడు. వార్డులోని పేషెంట్లతోనూ వసూళ్లకు పాల్పడ్డాడు. ఇలా దందాలు సాగిస్తున్నాడని సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం దుబ్బర్లపల్లికి చెందిన సాకే శివయ్యగా గుర్తించి కేసు నమోదుచేసి, అరెస్టు చేశారు. ఆసుపత్రిలోని కంటి విభాగంలో దంపెట్ల శివయ్య అనే ఉద్యోగి పనిచేస్తున్నారు. వసూలు చేస్తున్నది దంపెట్ల శివయ్య అని ఆసుపత్రిలో చర్చ మొదలైంది. దీంతో వసూళ్ల శివయ్య తానుకాదనీ, దుబ్బర్లపల్లికి చెందిన సాకే శివయ్యగా గుర్తించి కేసు నమోదు చేసి అరెస్టు చేశారని అధికారులకు దంపెట్ల శివయ్య లేఖ ఇచ్చుకోవాల్సి వచ్చింది.

'తరిమెల' ఆశయాలను కొనసాగిద్దాం

సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నాయకుడు జాస్తి కిషోర్‌బాబు


మాట్లాడుతున్న జాస్తి కిషోర్‌బాబు

అనంతపురం టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పోరాటయోధుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నాయకుడు జాస్తి కిషోర్‌బాబు పేర్కొన్నారు. తరిమెల నాగిరెడ్డి 49వ వర్థంతిని సోమవారం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాస్తి కిషోర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తరిమెల నాగిరెడ్డి విద్యార్థిగా ఉన్నపుడే జాతీయ ఉద్యమానికి ప్రభావితుడై బెనారస్ విశ్వవిద్యాలయంలో విద్యార్థి నాయకుడిగా ఎన్నికయ్యారన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు సిద్ధాంతాల మధ్య ఉన్న తేడాలను గుర్తించిన ఆయన ప్రజలకు నిజమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాన్ని, మెరుగైన జీవితాన్ని సాధించిపెట్టగలిగేది కమ్యూనిస్టు సిద్ధాంతమేనని నిర్ధారణకు వచ్చి, తన తుది శ్వాస వరకూ కమ్యూనిస్టుగా కొనసాగారన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచిన ఆయన చట్టసభల్లో పీడిత ప్రజలపక్షాన శక్తివంతంగా తన గళాన్ని వినిపించారని కొనియాడారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు అధ్యక్షుడు సూర్యసాగర్, మానవతా సంస్థ అధ్యక్షుడు తరిమెల అమర్నాథ రెడ్డి, ఎస్ఎం బాషా తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు నేడే ఆఖరు

కొత్తచెరువు, జూలై 28(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యాసంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి ఈనెల 29తో దరఖాస్తు గడువు ముగుస్తుందని జిల్లా విద్యాశాఖ సహాయ సంచాలకులు లాజర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పరీక్ష పూర్తిగా ఎన్‌వీఎస్(నవోదయ విద్యాలయ సమితి) కింద సీబీఎస్ఈలో ఉంటుందని ఆయన తెలిపారు. ఆసక్తి గల ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హెచ్‌టీటీపీ/సీబీఎస్ఈఐటీఎంఎస్.ఆర్‌సీఐఎల్.జీఓవీ.ఇన్/ఎన్‌వీఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

అత్తారింటి వేధింపులపై కేసు

ధర్మవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): భర్త, అత్త తరచూ వేధిస్తున్నారని వడితే లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఆయన తెలిపిన మేరకు...ధర్మవరం లోని చంద్రబాబునగర్‌కు చెందిన రామ్మూర్తినాయక్ ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఇతడి భార్య వడితే లక్ష్మీదేవి గృహిణి. వివాహం అయినప్పటి నుంచి రామ్మూర్తినాయక్ తల్లి పార్వతిబాయి మాటలు విని లక్ష్మీదేవిని శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. మద్యానికి బానిసై, వివాహేతర సంబంధాలు నడుపుతూ, విడాకుల కోసం భార్యను వేధించేవాడు. పెద్దమనుషులు పంచాయితీ చేసినా మార్పు రాకపోవడంతో లక్ష్మీదేవి తన పుట్టినిల్లు అయిన నేలకోట గ్రామానికి ఇద్దరు పిల్లలతో కలిసి వచ్చి ఉంటోంది. అయినా ఫోన్‌లో ఆమెకు వేధింపులు ఆగలేదు. వీటిని భరించలేక సోమవారం ఆమె భర్త, అత్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రైలు ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

అనంతపురం న్యూటౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐ మిట్ట సమీపాన పట్టాలు దాటుతున్న మహిళను సోమవారం సాయంత్రం వందేభారత్ రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. రైల్వే ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుమారు 30 ఏళ్ల వయసున్న మహిళ రైలు పట్టాలు దాటుతుండగా.. బెంగళూరు నుంచి వచ్చిన వందేభారత్ రైలు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను వెంటనే 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అపస్మారక స్థితిలో ఉండటంతో వివరాలు తెలియలేదని ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9441445354 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

ఘరానా దొంగ పరార్..?

సీసీఎస్ పోలీసుల అదుపులో నుంచి ఎస్కేప్

ఐదు రోజుల క్రితమే తప్పించుకున్న వైనం?

నిందితుడిపై 30 వరకూ కేసులు

అనంతపురం క్రైం, జూలై 28(ఆంధ్రజ్యోతి): అనంత సీసీఎస్ పోలీసుల అదుపులో ఉన్న ఘరానా దొంగ తప్పించుకున్నట్లు తెలుస్తోంది. తర్వాత దొంగను పట్టుకునేందుకు పోలీసులు పరుగులు తీసినట్లు సమాచారం. ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు. 5 రోజుల క్రితమే దొంగ తప్పించుకున్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు.. కంబదూరు మండలంలోని వెంకటంపల్లి తండాకి చెందిన ఓ నిందితుడిని ఇటీవల సీసీఎస్ పోలీసులు తీసుకొచ్చినట్లు సమాచారం. చైన్ స్నాచింగ్స్‌లో పేరుమోసిన నిందితుడిపై 30 వరకూ కేసులున్నట్లు తెలుస్తోంది. అతడిని విచారిస్తుండగా పరారైనట్లు తెలిసింది. తేరుకున్న పోలీసులు మళ్లీ దొంగ వేటలో పడినట్లు సమాచారం. అప్పటికే సదరు దొంగ సొంతూరికి వెళ్లినట్లు తెలిసింది. పోలీసులు అక్కడికి వెళ్లి దొంగను మళ్లీ తీసుకొచ్చి విచారణ చేస్తున్నట్లు తెలిసింది. సంబంధిత పోలీసు అధికారులు ఘరానా దొంగ పరారీపై నోరు మెదపడం లేదు. 'ఏం జరగలేదు... అంతా తూచ్' అంటూ పెదవి విరుస్తున్నారు. దొంగ పరారీ ఘటన బయటకు ఎలా వచ్చిందంటూ పోలీసులు హైరానా పడుతూ కనిపించడం చూస్తుంటే... ఎస్కేప్ నిజమేనని తెలుస్తోంది. మరి ఈ నిర్లక్ష్యంపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఏం చేస్తారో చూడాలి.

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్టంగా 16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్టంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.11వేలు పలికాయన్నారు.



ప్రత్యేక అలంకరణలో మొదటిరోడ్డులోని కాశీ విశ్వేశ్వరస్వామి



ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ





కమలానగర్ పాండురంగస్వామి ఆలయంలో జైన మహిళల పూజలు

భక్తిశ్రద్ధలతో శ్రావణ సోమవార పూజలు

● భక్తుల తాకిడితో కిక్కిరిసిన శివాలయాలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

అనంతపురం టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని నగరంలోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ప్రధానంగా శివాలయాలకు భక్తులు కిక్కిరిశారు. ఈ సందర్భంగా మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో అర్చకులు వేకువజామునే స్వామివారి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మహామంగళహారతి నివేదనానంతరం ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ జరిగింది. అలాగే కమలానగర్‌లోని పాండురంగ స్వామి ఆలయంలో జైనులు విరివిగా పాల్గొని పరమేశ్వరుడికి పూజలు చేశారు. అక్కడి నాగుల కట్ట వద్ద నాగుల ప్రతిమలకు క్షీరాభిషేకం చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఒకరినొకరు చేతులకు కంకణాలు కట్టుకున్నారు.

● శింగనమల: నాగులపంచమి పండుగను మండలప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయమే మహిళలు నాగులకట్టల వద్దకు వెళ్లి నాగుల ప్రతిమలకు క్షీరాభిషేకం చేసి ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే పుట్టల్లోకి పాలు పోసి పూజించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కార్యకర్తలు క్రమశిక్షణతో మెలగాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ సూచన



శిక్షణను ప్రారంభిస్తున్న జాఫర్ తదితరులు

బుక్కరాయసముద్రం, జూలై 28(ఆంధ్రజ్యోతి): జనసేవాదళ్ కార్యకర్తలు క్రమశిక్షణతో మెలగాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ సూచించారు. మండలంలోని గోవిందంపల్లి గ్రామ పంచాయతీ.. రాఘవేంద్ర కాలనీలో సోమవారం సీపీఐ జనసేవాదళ్, రెడ్ షర్ట్ వలంటీర్లకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణను జాఫర్‌తో పాటు ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్‌కుమార్, జాతీయ జనసేవాదళ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం జాఫర్ మాట్లాడుతూ.. జనసేవాదళం కార్యకర్తలు క్రమశిక్షణతో మెలగాలని, అలాగే శ్రమ జీవుల సమస్యలపై స్పందించాలని సూచించారు. విపత్తు సమయంలో సహాయక చర్యలు, ఆరోగ్యశిబిరాలు, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం లాంటి వాటిని నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణ స్వామి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పద్మావతమ్మ, అధ్యక్షురాలు పార్వతి, నాయకులు జానకి, యశోదమ్మ, రామాంజనేయులు, ఆనంద్, సుంకన్న, తిరుపతయ్య, బాషా తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను నాటి సంరక్షించాలి

రాప్తాడు, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం ఆమె మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. మొక్కల పెంపకం వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు వివరించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. సర్పంచ్ సాకే తిరుపాలు, డిప్యూటీ ఎంపీడీఓ ఆనంద్ ప్రసాద్, ఎంఈఓలు మల్లికార్జున, కుళ్లాయప్ప, హెచ్ఎం ఆంజనేయులు, ఐఆర్‌టీలు వెంకటనాయుడు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాలివ్వాలని వినతి

శింగనమల, జూలై 28(ఆంధ్రజ్యోతి): వర్షాలు సరిగా రాక జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టాయని, కనుక నష్టాల పాలయ్యే రైతులు, కౌలు రైతులు మళ్లీ పంటలు సాగు చేసుకునేందుకు అనుగుణంగా ప్రభుత్వం ఉచితంగా ప్రత్యామ్నాయ విత్తనాలు అందజేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డీ.చిన్నప్ప యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శేషారెడ్డి వినతి పత్రం అందజేశారు. నాయకులు మధుయాదవ్‌చికెన్ బాషా, మునిస్వామి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియామకం



ముత్యాలప్ప

అనంతపురం రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఎరుకుల సంక్షేమ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నగరానికి చెందిన సాకే ముసలయ్య నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాకే చిరంజీవి సోమవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. తన ఎంపికకు సహకరించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుంభ రాంబాబుకు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిరంజీవికి ముసలయ్య కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

పీ-4ను టీచర్లపై రుద్దడం సరికాదు: ఎస్టీయూ

అనంతపురం విద్య, జూలై 28(ఆంధ్రజ్యోతి): పీ-4 కార్యక్రమాన్ని ఉపాధ్యాయులపై బలవంతంగా రుద్దాలని చూడడం సరికాదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఇప్పటికీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. పైగా టీచర్లతో పాఠాల బోధన చేయనివ్వకుండా.. ఇతర పనులను అప్పజెబుతూ ఇబ్బందుల పాల్జేస్తున్నారని మండిపడ్డారు. మళ్లీ ఇపుడు పీ-4లో బాగస్వాములుకావాలని కొందరు డీఈఓలు ఇతరజిల్లాలో ఉత్తర్వులుఇవ్వడం అన్యాయమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి టీచర్లను ఇతర పనుల్ని ఉపయోగించకుండా చూడాలని, ఇచ్చినహామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

రోడ్డుప్రమాదంలో డ్రైవర్ మృతి

చెన్నేకొత్తపల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోన క్రాస్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కూడేరు మండలం కొర్రకోడు గ్రామానికి చెందిన రమేశ్(28)హిటాచీ డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. ఈ క్రమంలో స్థానికంగా హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. కోనక్రాస్ వద్దకు రాగానే ఉన్నట్టుండి కుక్క అడ్డురావడంతో దానిని తప్పించబోయి వాహనం అదుపు తప్పి కిందపడింది. ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడగా.. స్థానికులు వెంటనే సీకేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్యసరస్వతి, కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి మల్లికార్జున ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

భూసార పరీక్షలు తప్పనిసరి: ఆత్మ పీడీ



మాట్లాడుతున్న పద్మలత

రాప్తాడు, జూలై 28(ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా భూ సార పరీక్షలు చేయించాలని ఆత్మ పీడీ పద్మలత సూచించారు. మండలంలోని హంపాపురం రైతు సేవా కేంద్రంలో సోమవారం ఆమె రైతులతో సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరైతు తప్పనిసరిగా భూ సార పరీక్షలు చేయించాలన్నారు. భూ సార పరీక్షల ఆధారంగానే ఎరువులు వాడాలన్నారు. జీవన ఎరువులైన ట్రైకోడర్మవిరిడి, సుడోమోనస్ వంటి వాటినే వాడాలన్నారు. మొక్క జొన్న పంటలకు కంచె ఏర్పాటు చేయడం వలన చీడపీడల ఉధృతి తగ్గుతుందన్నారు. దీని వలన పురుగు మందుల వాడకం తగ్గించవచ్చన్నారు. ఖరీఫ్ పంటల బీమా గురించి ప్రతి రైతు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఏఓ కృష్ణ చైతన్య, ఏఈఓలు రంజిత, సుజిత, వీహెచ్ఏ పావని, ఎంపీఈఓ రాధ, పెద్దఎత్తున రైతులు పాల్గొన్నారు.

హుండీ అవకతవకలు జరగలేదు



సీసీ కెమెరా పుటేజీలను పరిశీలిస్తున్న గురుప్రసాద్

నార్పల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గూగూడు కుళ్లాయిస్వామి ఆలయంలో హుండీ మాయంపై సోమవారం దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా అక్కడి సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించారు. అనంతరం గూగూడు బ్రహ్మోత్సవాల్లో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన నగదు, బంగారు, వెండి ఆభరణాలతో పాటు తలనీలాల ద్వారా వచ్చిన డబ్బుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. తర్వాత మాట్లాడుతూ హుండీ అవకతవకలు జరగలేదని, కేవలం అవి పుకార్లు మాత్రమేనని తెలిపారు. అన్ని లెక్కలు సక్రమంగా ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శోభ, సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఐసీటీసీ వాహనం ప్రారంభం



జెండా ఊపి అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురం వైద్యం, జూలై 28(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలు, హెచ్ఐవీ ప్రబలుతున్న ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహించేందుకు ఐసీటీసీ వాహనాన్ని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీదేవి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ సంక్రమించే అవకాశమున్న వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి పరీక్షలు నిర్వహిస్తార న్నారు. నిర్ధారణ అయిన వారికి చికిత్సలు అందించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ అనుపమ, ప్రాజెక్ట్ ఆఫీసర్లు శ్రీనివాసులు రెడ్డి, ఏఓ గిరిజా మనోహర్, పీఎంఓ నాగన్న, డెమో త్యాగరాజు, హెచ్ఈఈఓ నాగరాజు, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు



నోరు కొట్టుకుంటున్న చిన్నారులు

శింగనమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురవాలంటూ మండలంలోని సోదనపల్లి గ్రామంలో ప్రజలు సోమవారం కాటమయ్యస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సోదనపల్లి, పోతురాజుకాల్వ గ్రామాల మధ్యలో బండ మీద వెలసిన కాటమయ్యస్వామికి పెద్ద ఎత్తున పూజలు జరిపారు. అదునులోపు వర్షాలు కురవాలని ప్రార్థించారు. పిల్లలు, పెద్దలు వర్షాలు కురవాలంటూ చేతులను నోటికి కొట్టుకుంటూ గట్టిగా అరిచారు. కాటమయ్య స్వామికి ఇలా పూజలు చేస్తే వర్షాలు వస్తాయనే నమ్మకం గ్రామస్థులలో ఉంది.

ఈ-పంట నమోదు పక్కాగా చేపట్టాలి

అనంతపురం అర్బన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): అనంతపురం డివిజన్ పరిధిలోని మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ఈ పంట నమోదు చేయాలని అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ ఆదేశించారు. అనంతపురం డివిజన్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సోమవారం ఆయన మండల వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఇప్పటి దాకా సాగు చేసిన పంటల వివరాలపై ఆరా తీశారు. ఈ పంట నమోదు ప్రక్రియను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే వాతావరణ బీమా, పసల్ బీమాకు ఇంకా మిగిలిన రైతులలో ప్రీమియం చెల్లించేందులకు చొరవ చూపాలని సూచించారు.

స్వచ్ఛరథంను విజయవంతం చేయాలి

అనంతపురం న్యూటౌన్ జూలై 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలని డీపీఓ నాగరాజు నాయుడు సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని జిల్లా పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఆయన డీఎల్‌పీఓ విజయ్‌కుమార్‌తో కలిసి డీపీఆర్‌సీ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి స్వచ్ఛ రథం అమలుపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే గుంటూరు రూరల్‌లోని మల్లవరం గ్రామ పంచాయతీలో పైలెట్ ప్రాజెక్టుగా స్వచ్ఛరథంను చేపట్టి మంచి ఫలితాలు రాబట్టడం జరిగిందన్నారు. అదే తరహాల్లో జిల్లాలో చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. ఏయే చర్యలు చేపట్టాలన్నది జాబితా సిద్ధం చేయాలని, అందుకు అనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ సౌజన్య. డిప్యూటీ ఎంపీడీఓ మాధవి, సిబ్బంది వరలక్ష్మి, గంగిరెడ్డి, నాగేంద్ర, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ధర్మవరపు మురళి

రాప్తాడు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరుగురికి 2.80 లక్షల మేర సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు టీడీపీ మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి అనంతపురం నగరంలోని పరిటాల క్యాంపు కార్యాలయంలో సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ, క్లస్టర్ ఇన్‌చార్జి నారాయణస్వామి, నాయకులు కేశవ, ప్రతాప్, మల్లికార్జున, యోగి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పరిటాల శ్రీరామ్

అనంతపురం రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటుకపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గంజి శ్రీరాములు గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. ఈయన గతంలో గ్రామ సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యుడిగా పని చేశారు. శ్రీరాములు మృతి విషయాన్ని తెలుసుకున్న పార్టీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ గ్రామానికి వచ్చి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యుల్ని పరామర్శించారు. పార్టీ, పరిటాల కుటుంబం అండగా ఉంటుందన్నారు. మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయవాదుల డిమాండ్లను తీర్చాలని ధర్నా

అనంతపురం క్రైం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం న్యాయవాదుల డిమాండ్లను తీర్చాలని అనంతపురం అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమన్న మాట్లాడుతూ.... జూనియర్ లాయర్లకు 14 నెలలుగా లా నేస్తం అందడం లేదన్నారు. ఇటీవల కాలంలో లాయర్లపై దాడులు జరుగుతున్నాయని, రక్షణ కల్పించాలని కోరారు. శ్రీబాగ్ ఒడంబడిక మేరకు సీమ జిల్లాల్లో హైకోర్టు ఏర్పాటుచేయాలన్నారు. బార్ కౌన్సిల్‌కు రావాల్సిన మ్యాచింగ్ గ్రాంట్స్ విడుదల చేయాలని కోరారు. పలు సంఘాల నాయకులు, న్యాయవాదులు హరి, అంపావతి గోవిందు, హర్షవర్ధన్‌రెడ్డి, రామలింగారెడ్డి, సరస్వతీ, నీరజ, సుధాకర్‌రెడ్డి, రంగనాయకులు, సాకే నరేష్, లక్ష్మణ్, నారాయణరెడ్డి, విజయభాస్కర్, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశక్తి సొసైటీ వార్షిక మహాసభ



మాట్లాడుతున్న మేరీ వటమట్టం

చెన్నేకొత్తపల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయ ఆవరణలో సోమవారం ఆదిశక్తి సొసైటీ 28వ వార్షిక మహాసభ ఘనంగా జరిగింది. సొసైటీ అధ్యక్షురాలు అశ్వర్థమ్మ, సీఈఓ శ్రీకవిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో మండలవ్యాప్తంగా ఉన్న ఆదిశక్తి సొసైటీ మహిళలు పాల్గొన్నా రు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఆర్థిక నివేదికను, తమ పాలక వర్గ మార్పులు, చేర్పులను సొసైటీ సీఈఓ మహాసభకు వివరించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు మేరీ వటమట్టం, బబ్లూ గంగూలి మాట్లాడుతూ... మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. టింబక్టు కలెక్టివ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుకన్య మాట్లాడుతూ... ఆదిశక్తి సొసైటీ ఈ ప్రాంతంలో మహిళల ఆర్థికాభివృద్ధికి, పరిపాలన నిర్వహణ కోసం ఎంతో దోహద పడుతోందని అన్నారు. కార్యక్రమంలో ఆదిశక్తి సొసైటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రపంచానికి దార్శనికం.. భారత రాజ్యాంగం

అనంతపురం వైద్యం, జూలై28(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలకు మన భారత రాజ్యాంగం దార్శనికమని పలువురు వక్తలు పేర్కొన్నారు. నగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గల ఓ కల్యాణమండపంలో సోమవారం జన మహోత్సవం క్లస్టర్ సభను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా మాజీ న్యాయమూర్తి కిష్టప్ప, బహుజన లాయర్స్ ఫోరం(బీఎల్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప తదితరులు హాజరై ఈ మేరకు మాట్లాడారు.

ఆలయ నిర్మాణానికి ముంటిమడుగు విరాళం

శింగనమల, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సుంకులమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి విరాళం అందజేశారు. జిల్లాకేంద్రంలోని నివాసంలో సోమవారం తనను కలిసి ఆలయ కమిటీ సభ్యులకు ఆయన రూ.10వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుంకన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తరిమెల నాగిరెడ్డికి ఘన నివాళి



శింగనమలలో ర్యాలీ చేస్తున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ శ్రేణులు

శింగనమల, జూలై 28(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్ట్ యోధుడు తరిమెల నాగిరెడ్డి 49వ వర్ధంతిని మండలకేంద్రంలోని రామస్వామి ఆలయం వద్ద సీపీఐ(ఎం,ఎల్) న్యూడెమోక్రసీ నాయకులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఎర్రజెండాలు చేతపట్టి పురవీధుల్లో పెద్దఎత్తున ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్, జిల్లా అధికార ప్రతినిధి సీ.నాగరాజు మాట్లాడుతూ.. తరిమెల నాగిరెడ్డి కమ్యూనిస్టు మేధావి అని, పోరాట యోధుడని, పేదల కుటుంబాలకు అండగా నిలిచిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. దేశంలోనే కమ్యూనిస్టు పార్టీకి వన్నె తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సభ్యుడు ఏసురత్నం, భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు క్రిష్ణ, తరిమెల రామాంజనేయులు, రాయుడు, వీరేంద్ర, వీరనారప్ప, పెద్దఎత్తున సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ శ్రేణులు, కూలీల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

● అనంతపురం క్లాక్‌టవర్: నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో కమ్యూనిస్టు యోధులు తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వర్లు సంతాపసభను భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం (యూసీసీఆర్ఐ-ఎంఎల్) ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వర్లు చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. భారత విప్లవోద్యమంలో వారిరువురూ కృష్ణార్జునులుగా పనిచేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో విప్లవ రచయిత జెట్టి జైరామ్, ఓపీడీఆర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలు, యూసీసీఆర్ఐ నాయకుడు భాస్కర్, గ్రామీణ పేదల సంఘం నాయకుడు భాస్కర్, నాగభూషణం, భారతచైనా మిత్రమండలి రాష్ట్ర కార్యదర్శి అజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, జూలై 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మండలంలోని సోదనపల్లిలో సోమవారం సాయంత్రం ఆమె సుపరిపాలనలో తొలిఅడుగు కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఏడాది పాలనతో రాష్ట్ర ప్రభుత్వం చేసిపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. అలాగే కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. సుపరిపాలన అందించడం సీఎం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. తర్వాత గ్రామంలో మీనీ గోకులం షెడ్డు నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఆదినారాయణ, సీనియర్ నాయుకుడు ఈశ్వర్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు షాలినీ మారుతీ నాయుడు, నాయకులు గుర్రం లక్ష్మీనారాయణ, చితంబరిదొర, అట్టే రామాంజనేయులు, ఏకుల ఆది, అట్టే శంకరయ్యతో పాటు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మదర్ థెరిసా కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు

అనంతపురం రూరల్, జూలై28(ఆంధ్రజ్యోతి): రుద్రంపేట పంచాయతీ మదర్ థెరిసా కాలనీలో సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో రుద్రంపేట క్లస్టర్ ఇన్‌చార్జి గోపాల్ గౌడ్, యూనిట్ ఇన్‌చార్జి కదిరప్ప, నాయకులు ఆదినారాయణ, బాలప్ప, పాలాక్షిసుభాన్, మారెప్ప, ఎర్రమ్మ, మారెక్క, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

హత్యలపై సమగ్ర విచారణ జరపాలి

అనంతపురం విద్య, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలో పవిత్ర పుణ్యక్షేత్రమైన ధర్మస్థలంలో జరిగిన హత్యాఘటనలపై ప్రభుత్వాలు సమగ్ర విచారణ జరపాలని మహిళాసమాఖ్య జిల్లాఅధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పార్వతీ, పద్మావతి డిమాండ్ చేశారు. రాష్ట్రకమిటీ పిలుపు మేరకు సోమవారం వారు నగరంలోని పాతూరులో గల మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధర్మస్థలంలో ఇటీవల వరుసగా బయటపడుతున్న మహిళలపై అత్యాచారాలు, హత్యా ఉదంతాలు ప్రజల్ని భయందోళనకు గురిచేస్తున్నాయన్నారు. వీటిపై సమగ్రవిచారణ చేపట్టి కారకులను కఠినంగా శిక్షించాలన్నారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మహిళాసమాఖ్య నాయకురాళ్లు యశోదమ్మ, జానకి, లక్ష్మీదేవి, అరుణ, లలిత, రాములమ్మ, రమాదేవి, పుల్లమ్మ, స్వాతి, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

విన్సెంట్ డీపాల్, రాధా స్కూల్ జట్ల గెలుపు



బాలికల విభాగ విజేత సెయింట్ విన్సెంట్ డీపాల్ స్కూల్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): క్రికెట్ పోటీల్లో విన్సెంట్ డీపాల్, రాధా స్కూల్ జట్లు గెలుపొందాయి. అనంత క్రీడా గ్రామం ఆధ్వర్యంలో గత 15రోజులుగా నిర్వహిస్తున్న అనంతపురం స్థాయి పాఠశాలల క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. 40 బాలుర జట్లు, 22 బాలికల జట్లు ప్రాతినిథ్యం వహించాయి. సోమవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించిన ఫైనల్ పోటీల్లో బాలురలో సెయింట్ విన్సెంట్ డీపాల్ జట్టుపై రాధా స్కూల్ ఆఫ్ లర్నింగ్ జట్టు విజయం సాధించి విజేతగా నిలిచింది. బాలికల విభాగంలో ఆర్డీటీ ఇన్‌క్లూజివ్ హైస్కూల్ జట్టుపై సెయింట్ విన్సెంట్ డీపాల్ జట్టు గెలుపొందింది. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి విజేత జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. అనంత క్రీడాగ్రామం మేనేజర్ శ్రీదేవి, పీఈటీలు నారాయణరెడ్డి, బాలకృష్ణ, నారాయణ, కోచ్‌లు పాల్గొన్నారు.

పరిష్కార వేదికకు.. అధికారుల డుమ్మా

● ముగ్గురు మాత్రమే హాజరు..
● మొక్కుబడిగా కార్యక్రమం

బుక్కరాయసముద్రం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు తమకెందుకులే అనుకున్నారో.. ఏమో.. ప్రజాసమస్యల పరిష్కారవేదిక అంటే మండలంలోని అధికారులకు జవాబుదారీతనం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం పట్ల అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు కేవలం తహసీల్దార్ శ్రీధర్ మూర్తి మాత్రమే ఉదయం 10 గంటలకు హాజరయ్యారు. అనంతరం 10 నిముషాల తర్వాత ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వచ్చారు. 11:28 గంటలకు ఉద్యానశాఖాధికారి శైలజ, 11:40కి ఈఓఆర్డీ సదాశివ హాజరయ్యారు. ఇక ఆ తర్వాత ఏ అధికారి కూడా రాలేదు. కేవలం ముగ్గురు అధికారులు మాత్రమే హాజరై కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహించడం పట్ల ప్రజలు నిట్టూర్చారు. చాలా సార్లు అధికారులు ఇలానే గైర్హాజరవుతుంటారని మండిపడ్డారు. దీంతో పలు శాఖల్లోని సమస్యల్ని విన్నవిద్దామని వచ్చిన అనేకమంది ప్రజలు ఆ శాఖల అధికారులు లేనిది చూసి నిరాశతో వెనుదిరిగారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా... ప్రజా సమస్యల పరిష్కార వేదికకు గైర్హాజరైన అధికారులతో ఎందుకు రాలేదో వివరణ తీసుకుంటామన్నారు. వచ్చే సోమవారం నుంచి హాజరు కాకపోతే... కలెక్టర్‌కు నివేదిక పంపుతామని తెలిపారు.

ఈ సారి అందరూ వచ్చారు..

● ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల అధికారుల హాజరు



హాజరైన అధికారులు

శింగనమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. దీంతో వేదిక కళ కళలాడింది. గత సోమవారం జరిగిన కార్యక్రమంలో అధికారులు సరిగా హాజరు కాకపోవడంపై ఆంధ్రజ్యోతిలో సమయపాలన పాటించని అధికారులు, తూతూ మంత్రంగా ప్రజా సమస్యల వేదిక అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన తహసీల్దార్ శేషారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సూర్య ప్రతాప్ హాజరుకాని అధికారులకు నోటీసులు జారీ చేశారు. దీంతో ఈ సోమవారం వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ సమస్యల పరిష్కరించాలంటూ అర్జీలు అందజేశారు.

న్యూస్ బాక్స్

ఉరుసు ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పయ్యావుల శ్రీనివాసులు

ఉరవకొండ, జూలై 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జైనబ్బీ దర్గా ఉరుసు ఉత్సవాల పోస్టర్‌ను టీడీపీ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు అనంతపురంలోని రాంనగర్‌లోని తన నివాసంలో సోమవారం ఆవిష్కరించారు. అలాగే ఉరుసు ఉత్సవాల ఆహ్వాన పత్రికను కమిటీ సభ్యులు ఆయనకు అందజేశారు. ఈ ఉరుసును నెల 20 నుంచి 22వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో కమిటీ సభ్యులు హోతూరు బాషా, బ్యాళ్ల ప్రసాద్, టీడీపీ నాయకుడు రహంతులా పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి



చందవంద్రి(ఫైల్)

బొమ్మనహాళ్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవాడలో టీడీపీ సీనియర్ కార్యకర్త చందవంద్రి (85) అనారోగ్యంతో సోమవారం మరణించాడు. ఆయన మృతదేహానికి టీడీపీ నాయకుడు సోమనాథ్ గౌడ్, సుంకన్న, వన్నూరుస్వామి, గురుస్వామి, మునిస్వామి, గంగరాజు, నటరాజ్ నివాళులర్పించారు. అంత్యక్రియలకు సోమనాథ్‌గౌడ్ రూ. 5000 ఆర్థిక సాయం అందించారు.

డిజిటల్ క్రాప్ సర్వేపై శిక్షణ

కుందుర్పి, జూలై 28(ఆంధ్రజ్యోతి) : స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల రైతు సేవా కేంద్ర సిబ్బందికి ఈ పంట డిజిటల్ క్రాప్ సర్వేపై శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితుల్లో విస్తీర్ణం తప్పుగా నమోదు చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కులశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

త్వరలో మున్సిపల్ భవన నిర్మాణానికి శ్రీకారం

గుత్తి, జూలై 28(ఆంధ్రజ్యోతి): త్వరలోనే స్థానిక మున్సిపల్ కార్యాలయానికి నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 70 సెంట్ల విస్తీర్ణంలో 3200 చదరపు అడుగుల మేరకు భవన నిర్మాణం చేపట్టేందుకు రూ. 2.42 కోట్లు మంజూరు కాగా ఇప్పటికే టెండర్లు కూడా పూర్తి అయ్యాయన్నారు.

● రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. కార్యాయంలోని కౌన్సిల్ హాల్‌లో ఉదయం 11గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు హాజరుకావాలన్నారు.

● అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోండి

మున్సిపల్ పరిధిలో అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. అనధికార లేఅవుట్‌లలో ప్లాట్‌లను కొనుగోలు చేసుకొని రిజిస్టర్ చేయించుకున్న స్థల యజమానులు 90రోజుల లోపు ప్రభుత్వానికి తగిన రుసుం చెల్లించాలని, తద్వారా భవన నిర్మాణానికి అనుమతులు లభిస్తాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా స్వామివార్ల ఊరేగింపు

కణేకల్లు, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శ్రీచిక్కణ్ణేశ్వరస్వామి, శ్రీసిద్ధప్పస్వామిని సోమవారం రాత్రి పల్లకిలో గ్రామపుర వీధులలో ఊరేగించారు. టీడీపీ నాయకుడు వేలూరు మరియప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అధికారులు డుమ్మా

శెట్టూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధిక శాతం అధికారులు డుమ్మా కొట్టారు. తహసీల్దార్, వ్యవసాయాధికారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హెల్త్ సూపర్‌వైజర్ మాత్రమే పాల్గొన్నారు. 12 గంటల తరువాత ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్, హౌసింగ్ ఇంజనీరు, ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

కూలిన హెచ్చెల్సీ అక్విడెక్ట్



మరమ్మతులు చేస్తున్న కూలీలు

కణేకల్లు, జూలై 28(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ కాలువపై 159 కిలోమీటర్ల వద్ద ఉన్న అక్విడెక్ట్ గోడ ఆదివారం రాత్రి కొంతమేర కూలడంతో నీరు వృధా అయిం ది. దీంతో అధికారులు సోమవారం యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేశారు. దీంతో హెచ్చెల్సీ డీఈ దివాకర్‌రెడ్డి, జేఈ నరేంద్ర మారుతి, డీసీ సంఘం ఉపాధ్యక్షుడు బీటీ రమేష్ ఆధ్వర్యంలో ఈ పనులు చేయించారు. కూలిన గోడ స్థానంలో దాదాపు 450 ఇసుక బస్తాలను అడ్డుగా పెట్టి నీటి లీకేజీ లేకుండా చేశారు.

ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న కరస్పాండెంట్, డైరెక్టర్

గుంతకల్లుటౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఆరో ఆంధ్ర మహిళ బెటాలియన్ పది రోజుల పాటు నిర్వహించిన ఎన్‌సీసీ వార్షిక శిక్షణా శిబిరంలో స్థానిక శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల నుంచి ఎనిమిది మంది మహిళా క్యాడెట్స్ పాల్గొన్నారు. వారు క్విజ్, కల్చరల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రాలను అందుకున్నారు. వారిని సోమవారం కళాశాలలో కరస్పాండెంట్ కేసీ హరికుమార్, డైరెక్టర్ పీ గోపాల్, ప్రిన్సిపాల్ ఆర్ సురేష్‌బాబు, ఎన్‌సీసీ ఆఫీసర్ లాస్య, అధ్యాపకుడు క్రిష్ణయ్య అభినందించారు.

తరిమెల నాగిరెడ్డికి నివాళి

గుంతకల్లుటౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): తరిమెల నాగిరెడ్డి 40వ వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద ఆ పార్టీ నాయకులు సోమవారం నివాళులర్పించారు. ఇందులో పార్టీడివిజన్ కార్యదర్శి బీ సరేష్, ఓపీడీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు న్యాయవాది నాగరాజు, రాయలసీమ విద్యావంతుల వేదిక కార్యదర్శి వెంకటేష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజలకు వివరించండి

యాడికి, జూలై 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య సూచించారు. సోమవారం స్థానిక చౌడేశ్వరి కల్యాణ మండపంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందులో టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, యాడికి సింగిల్‌విండో ఛైర్మన్ చలమారెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పరిమి సోమశేఖర్, పరిమి చరణ్, నాగమునిరెడ్డి, రామచంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, బొట్టుశేఖర్, ఆదినారాయణ పాల్గొన్నారు.

కార్యాలయం ఖాళీ..!

- గాడి తప్పిన పాలన
- రెగ్యులర్ తహసీల్దార్ లేక పాట్లు
- ఆరు నెలల్లో ఆరుగురు ఇన్‌చార్జిల మార్పు
- విధులకు రాని కిందిస్థాయి సిబ్బంది
- సమస్యలతో కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ప్రజలు



ఖాళీగా ఉన్న తహసీల్దారు కుర్చీ

విడపనకల్లు, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలానికి రెగ్యులర్ తహసీల్దారు లేకపోవటంతో పరిపాలన మొత్తం కుంటు పడింది. జనవరిలో రెగ్యులర్ తహసీల్దారు సునీతాబాయి ఉద్యోగోన్నతిపై కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. నాటి నుంచి నేటి వరకూ రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించకుండా.. ఇన్‌చార్జిల పాలనే సాగుతోంది. అది కూడా కేవలం ఆరు నెలల్లో ఆరుగురు ఇన్‌చార్జీలు మారారు. ప్రస్తుతం గుంతకల్లు తహసీల్దారు రమాదేవి ఇన్‌చార్జి తహసీల్దారుగా వ్యవహరిస్తున్నారు. వన్‌బీల కోసం రైతులు... కులధ్రువీకరణల పత్రాల కోసం విద్యార్థులు నెలలు తరబడి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. మండలానికి కీలకమైన తహసీల్దార్ రెగ్యులర్ లేకపోవడంతో కింద స్థాయి సిబ్బందీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సమయపాలన ఏ మాత్రం పాటించడం లేదు. ఎప్పుడు చూసినా కార్యాలయాల్లో కుర్చీలు ఖాళీగా ఉంటున్నాయి.

వన్‌బీ అడంగల్ కావాలి



బ్యాంక్‌లో రుణాలు రెన్యువల్ చేసుకోవాలంటే వన్‌బీలు తప్పని సరి. కానీ ఇక్కడ మాత్రం వన్‌బీలు ఇచ్చే నాథుడే లేడాయే. వన్ అడంగల్ కోసం 15 రోజుల నుంచి ఎమ్మార్వో కార్యాలయానికి వచ్చిపోతున్నా. డిజిటల్ కీ లేదంటూ వెనక్కుపంపుతున్నారు. ఇంకా ఎన్ని రోజులు ఈ కార్యాలయం చుట్టూ తిరిగితే వన్‌బీలు ఇస్తారో తెలియడం లేదు.

\- గాదిలింగ, రైతు, హావళిగి గ్రామం

నెల రోజులుగా తిరుగుతున్నా



నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. పాస్ బుక్కులూ ఉన్నాయి. సాగు కూడా చేస్తున్నా. కానీ ఆన్‌లైన్‌లో మాత్రం మా సర్వే నంబర్లు రావటం లేదు. ఆన్‌లైన్‌లో ఎక్కించాలని నెల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఉన్న ఏ ఒక్క అధికారీ కనికరించటంలేదు. నెల రోజులు తిరిగి తిరిగి కాలికి దెబ్బతగిలి పెద్ద గాయమైంది. ఓ పక్క ఆసుపత్రిలో చూపించుకుంటూనే తహసీల్దారు కార్యాలయానికి వస్తున్నా. జిల్లా అధికారులైనా స్పందించి నాకు న్యాయం చేయాలి.

\- శివ, రైతు, డొనేకల్లు గ్రామం



ఖాళీగా ఉన్న అధికారులు, కంప్యూటర్ సిబ్బంది, వీఆర్వోలు, సర్వేయర్ల కుర్చీలు

అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటా: విప్



రంగచేడు సభలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

గుమ్మఘట్ట, జూలై 28(ఆంధ్రజ్యోతి): తనను గెలిపించినందుకు గ్రామాలను అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని రంగచేడులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణజలాలు అందించి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ఇప్పటికే గ్రామంలో తన సొంత నిధులతో రూ.4 లక్షలతో రెండు మట్టిరోడ్లు వేయించానని. ప్రభుత్వ నిధులతో రాయదుర్గం నుంచి కలుగోడు వరకు తారురోడ్లు వేయించామని తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌చార్జ్ కాలవ సన్నన్న, బీటీపీ ఛైర్మన్ కాలవ రాజు, స్థానిక నాయకులు రామప్ప, ఓబన్న, గోవిందప్ప, చిత్తయ్య, ఆంజనేయులుతోపాటు మరికొంతమంది యువ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

● 85 శాతం పూర్తి

రాయదుర్గం: సుపరిపాలనలో తొలి అడుగు ద్వారా నియోజకవర్గంలో 83,547 ఇళ్లు ఉండగా ఇప్పటివరకు 70,881 ఇళ్లకు వెళ్లామని, 85 శాతం పూర్తి చేశామని విప్ కాలవ తెలిపారు. ఏడాది పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను చంద్రబాబు నిలుపుకోవడం వల్ల ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా కూటమి ప్రభుత్వానికి ప్రజాదరణ స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

తుప్పు పడుతున్న 'స్వచ్ఛ' యంత్రాలు



బెళుగుప్పలో నిరుపయోగంగా డ్రైనేజీలో చెత్త తొలగించే యంత్రం, చెత్త తరలించే వాహనాలు

బెళుగుప్ప/కూడేరు జూలై 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన స్వచ్ఛభారత్ కార్యక్రమాలు స్థానిక అధికారుల నిర్లక్ష్యం వల్ల నీరుగారిపోతోంది. బెళుగుప్ప, కూడేరు మండలాల్లో మురుగు కాలవల్లో చెత్తను తొలగించడానికి మంజూరు చేసిన ఎక్స్‌కవేటర్లు, చెత్తను తీసుకెళ్లే ట్రాక్టర్లు, రిక్షాలను అధికారులు నిరుపయోగంగా పడేశారు. దీంతో అవి తుప్పుపట్టి నాశనం అవుతున్నాయి. రూ.లక్షలు విలువ చేసే వాహనాలను వినియోగంలోకి తెచ్చేలా అధికారులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.



కూడేరులో నిరుపయోగంగా ఉన్న చెత్త తరలించే వాహనాలు, ట్రాక్టర్

ప్రహరీ నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..?

కూడేరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలం కరుట్లపల్లిలో వైసీపీ పాలనలో చేపట్టిన శ్మశాన వాటిక అభివృద్ధి, ప్రహరీ నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీని నిర్మాణానికి నాటి ఎంపీ నిధుల కింద రూ.8 లక్షలు కేటాయించారు. అయితే ఆ నిధులు పూర్తిగా మంజూరు కాకపోవడంతో ఆ పనులు ఆగిపోయాయి. దీనిపై పంచాయితీ రాజ్ ఏఈ రమణయ్యను వివరణ కోరగా.. త్వరలోనే పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.



ఆగిన శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణం

మంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం , జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాపిరి గ్రామానికి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి బుధవారం వస్తున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ప్రజావేదికలో కళ్యాణదుర్గం డివిజన్ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా మంత్రి ఇంటింటికి వెళ్తారన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇంటి పట్టాను మంజూరు చేయాలని, కనీసం ప్రతి మండలంలో రెండు వేల మంది అర్హులకు పట్టాలు ఇవ్వాలని సూచించారు. గ్రామంలో ఎక్కడైనా ప్రభుత్వ స్థలం లేకపోతే ప్రైవేట్ స్థలం కొనుగోలుకు ప్రతిపాదనలు పంపాలని, ఆ గ్రామంలో ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారో వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వసంతబాబు, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, తహసీల్దార్లు, ఆయా శాఖల అధికారులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన అధ్యక్షుడు, సభ్యులు

గుత్తిరూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): తొండపాడు గ్రామంలోని రంగనాథస్వామి దేవాలయంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ) సింగల్ విండో అధ్యక్షుడిగా శివశంకర్ యాదవ్, సభ్యులుగా రమణ, సుంకన్న సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వారిని పలువురు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, సింగల్ విండో అధ్యక్షుడు శివ శంకర్, పట్టణ, మండల కన్వీనర్, బర్దీవలి, ఏంకే చౌదరి, మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రతాప్, టీడీపీ నాయకులు చికెన్ శీనా, చిన్నరెడ్డి యాదవ్, శ్రీనివాస్ యాదవ్, మద్దిలేటి, కేబీ రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు నారాయణస్వామి, సర్పంచులు భరత్, లింగమయ్య, మాజీ సర్పంచులు శ్రీనివాస్ చౌదరి, వెంకటనారాయణ, సాంబశివ, లక్ష్మీనారాయణమ్మ, నరసింహులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఛైర్మన్‌గా మస్తానప్ప



నియామక పత్రాన్ని అందుకొంటున్న మస్తానప్ప

గుంతకల్లు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రా థమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ (పీఏసీఎస్) ఛైర్మన్‌గా టీడీపీ నాయకుడు తలారి మస్తానప్ప సోమవారం బాధ్యతలను స్వీరించారు. పీఏసీఎస్ ఛైర్మన్‌గా నామినేటెడ్ పదవిని పొందిన మస్తానప్ప ఈ నెలలోనే బాధ్యతలను స్వీకరించాలన్న నిబంధన ఉందని అధికారులు తెలపడంతో సొసైటీకి వెళ్లి రిపోర్టుచేశారు. పీఏసీఎస్ డివిజనల్ అధికారి వీఏ శ్రీనివాసులు నియామక పత్రాన్ని అందజేశారు. ఇందులో గుంతకల్లు పీఏసీఎస్ సీఈఓ కుల్లాయిపీరా, సిబ్బంది మధుబాబు, అంజన్ రెడ్డి, పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్‌పై అభిప్రాయ సేకరణ



మాస్టర్ ప్లాన్‌తో కమిషనర్

రాయదుర్గం, జూలై 28(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం సోమవారం పట్టణ డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌పై అభిప్రాయాలను సేకరించేందుకు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి నోటిఫికేషన్ విడుదల చేశారు. పట్టణాభివృద్ధికి దీర్ఘకాలిక వ్యూహాన్ని నిర్ధేశించేలా మాస్టర్ ప్లాన్ ఉంటుందని, దీనిపై సందేహాలు ఉంటే పట్టణ ప్రణాళిక విభాగాన్ని సంప్రదించాలని సూచించారు. 30 రోజుల పాటు ప్రదర్శనకు ఉంచిన మాస్టర్ ప్లాన్‌పై అభిప్రాయాలను తెలియజేయాలని సూచించారు. ఆయన వెంట టీపీఓ మురళి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: నాగుల చవితి పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. రాయదుర్గం పట్టణంలోని బీటీపీ లేఅవుట్‌లో నూతన నిర్మించనున్న శ్రీఅయోధ్య కళ్యాణ ఆలయ నిర్మాణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నాగదేవతల విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే ఉరవకొండ, తాడిపత్రి, యాడికి, బెళుగుప్ప, యల్లనూరు తదితర ప్రాంతాల్లో, మండలంలోని గ్రామాల్లో నాగుల కట్టలకు, పాముల పుట్టలకు భక్తులు పూజలు చేశారు.



బెళుగుప్ప, ఉరవకొండలో నాగుల విగ్రహాలకు, యాడికిలో పుట్టకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

క్రైం న్యూస్..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పెద్దవడుగూరు, జూలై28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఐస్‌క్రీమ్ బండిని టిప్పర్ సోమవారం ఢీకొనడంతో గుత్తి మండలం మామూడూరు గ్రామానికి చెందిన సాలప్పకు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

బైక్ అదుపు తప్పి..

గుత్తిరూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్లచెరువు వాసి నాగరాజు బైక్‌పై గుత్తికి సోమవారం వెళ్తుండగా కొత్తపేట వద్ద బైక్ అదుపు తప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఎరువుల దుకాణం సీజ్

కుందుర్పి, జూలై 28(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎరువుల దుకాణాలను ఏడీ యల్లప్ప సిబ్బందితో కలిసి సోమవారం తనిఖీ చేశారు. వెంకటేశ్వర ఫర్టిలైజర్ షాపులో అనుమతులు లేని ఎరువులు, విత్తనాలు ఉండటంతో ఆ షాపును సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో స్థానిక ఏఓ విజయ్‌కుమార్, క్వాలిటీ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్లు మహేష్ శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. దాడుల విషయాన్ని తెలుసుకున్న పట్టణంలోని తొమ్మిది దుకాణాల యజమానులు షాపులకు తాళాలు వేసి వెళ్లిపోయారు.

గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

కళ్యాణదుర్గం, జూలై28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యరనాల వీధి, బళ్లారి మిట్ట, వెంకటమ్మ థియేటర్ సమీపంలోని ఇళ్లల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 35 గ్యాస్ సిలెండర్లను అనంతపురం విజిలెన్స్ సీఐ సద్గురుడు ఆధ్వర్యంలో అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

మట్కా బీటర్ల అరెస్ట్

తాడిపత్రి, జూలై 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్టాండ్ సమీపంలో సోమవారం ఇద్దరు మట్కాబీటర్లను అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి రూ.40వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. వారిపై కేసు నమోదుచేశామన్నారు.

ప్లాస్టిక్ విక్రేతలకు జరిమానా

ఉరవకొండ, జూలై 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు షాపుల్లో పంచాయతీ కార్యదర్శి గౌస్ తన సిబ్బందితో సోమవారం తనిఖీలు చేపట్టారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్న 15 దుకాణాదారులకు రూ.9,200 జరిమానా విధించారు.

గ్రామాల్లో సోదాలు

బొమ్మనహాళ్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోళగానహళ్లి, మైలాపురం గ్రామాల్లోని అనుమానితుల ఇళ్లలో ఎస్‌ఐ నబీరసూల్ సోమవారం సాయంత్రం సోదాలు చేపట్టారు. గ్రామాల్లో గొడవలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోంటామని హెచ్చరించారు.

మద్యం స్వాధీనం

తాడిపత్రి, జూలై28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపొలమడలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసినట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అతని వద్ద నుంచి 27 మద్యం బాటిళ్లను సీజ్ చేసి.. కేసు నమోదు చేశామన్నారు.

అసాంఘిక కలాపాలపై డ్రోన్‌తో నిఘా



డ్రోన్ కెమెరాతో పరిశీలిస్తున్న ఎస్‌ఐ

విడపనకల్లు, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలో అసాంఘిక కార్యక్రమాల కట్టడికి ఇకపై డ్రోన్ సాయంతో నిఘా వేస్తున్నట్లు ఎస్‌ఐ ఖాజా హుస్సేన్ సోమవారం తెలిపారు. ఎక్కడైనా అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్నా, పేకాట ఆడుతున్నా, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్నా వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న అధికారులు


యల్లనూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విఘ్నేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాము, ఆర్ఐ విజిత, వీఆర్వోలు మన్మథరెడ్డి, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఘనంగా మంజునాథస్వామి ఆరాధనోత్సవం



బెళుగుప్ప, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మంజునాథస్వామి 51వ ఆరాధన మహోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం గణపతిపూజ, అశ్వర్థనారాయణస్వామి, నవగ్రహ పూజ, పంచామృతాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, వరుణ ప్రార్థన, మహామంగళహారతి, సాయంత్రం రథోత్సవం, రాత్రి భజనలతో ఉత్సవాలు ముగిశాయి.

తాడిపత్రికి చేరిన 'ప్రేమ ప్రవాహిని'



తాడిపత్రి, జూలై 28(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా సత్యసాయి దివ్యసందేశాన్ని భక్తులకు తెలియజేసేందుకు సత్యసాయి జిల్లా పుట్టపర్తి నుంచి ప్రారంభించిన ప్రేమ ప్రవాహిని రథం సోమవారం తాడిపత్రికి చేరుకుంది. ఈ రథాన్ని సత్యసాయి మందిరానికి సత్యసాయిసేవా సమితి సభ్యులు, భక్తులు ర్యాలీగా తీసుకువచ్చారు. రథాన్ని తిలకించడానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

పద్మశాలి సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

రాయదుర్గం, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కండేయస్వామి దేవాలయంలో సోమవారం పద్మశాలి బహుత్తమ సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అరవ శివప్ప, ప్రధాన కార్యదర్శిగా చుంచుల నాగప్ప, గౌరవ అధ్యక్షుడిగా పొరాళ గోవిందరాజులు, ఉపాధ్యక్షుడిగా సోమ పాండు, కార్యదర్శులుగా పొరాళ శివకుమార్, శ్రీరాములు సిద్ధప్ప, పెనుగొండ్ల వెంకటేశులు, చుంచుల గౌరీశంకర్, బొప్పతి హనుమంతు, పొరాళ్ల సురేంద్ర, సోమ రాము, సహాయ కార్యదర్శులుగా వరద శ్రీనివాసులు, బొప్పతి ప్రసాద్, ఏరే ప్రసాద్, కొంగతి సత్యనారాయణ, కోశాధికారిగా చుంచుల వెంకటరమణ, అరవ శ్రీనివాసులు, ప్రచార కార్యదర్శులుగా వేమనపల్లి గురురామచేంద్ర ప్రసాద్, చుంచుల అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు.